విశాఖపట్టణం
గురువారం 23 జులై 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:180 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# భూములకు ఇక శాశ్వత భద్రత

## మీ భూమి - బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ప్రాజెక్టు

సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా డిజిటలైజేషన్

వర్చువల్‌గా ప్రారంభించనున్న చంద్రబాబు



2

# భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి రండి

## ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు ఆహ్వానం... కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానిని ఆహ్వానించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చేందుకు ప్రధాని మోదీ అంగీకరించినట్లు తెలుస్తోంది. సుమారు 30 నిమిషాలకు పైగా చంద్రబాబు, మోదీ ముఖాముఖీ భేటీ అయ్యారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య సుదీర్ఘ చర్చలు జరిగినట్లు సమాచారం.





బుధవారం చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు కూడా ప్రధానిని కలిశారు. ప్రధానితో చంద్రబాబు భేటీ సందర్భంగా ఆసక్తికర సన్నివేశం జరిగింది. టీడీపీ ఎంపీ అప్పలనాయుడిని భోగాపురం విమానాశ్రయం ఉన్న స్థానిక ఎంపీ అంటూ ప్రధాని మోదీకి ఆత్మీయంగా పరిచయం చేశారు. 'అప్పలనాయుడు నాకు తెలుసు... ఆయన ప్రతిరోజూ సైకిల్‌పై పార్లమెంటుకు వస్తున్నారు' అంటూ ఎంపీని ప్రధాని అభినందించారు. ప్రధానితో భేటీ అనంతరం కేంద్ర మంత్రి పీయుష్ గోయల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సుమారు 50 నిమిషాలు పాటు జరిగిన సమావేశంలో ఏపీకి కొత్త పారిశ్రామిక ప్రాజెక్టులు, పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆపై కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు.

## వైమానిక ప్రస్థానంలో సరికొత్త శకం..!

ప్రారంభానికి సిద్ధమైన భోగాపురం ఎయిర్పోర్ట్

2



### బాబు వల్లే పొగాకు

# రైతులకు కష్టాలు

## 232 మిలియన్ కిలోల పంటకు 16.5 శాతమే కొనుగోలు

దళారులు దోచుకుంటున్నా ప్రభుత్వం ప్రేక్షక పాత్ర

నిబంధనలు పాటించని సంస్థలపై చర్యలేవీ

కేసులు లేవు.. లైసెన్స్ లు రద్దు చేయలేదు

వచ్చే వారం రైతులకు మద్దతుగా పర్యటిస్తా

పొగాకు రైతులతో మాజీ సీఎం జగన్

(తాడేపల్లి - జయజయహే)

పొగాకు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ధరల సంక్షోభంపై వైయస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పొగాకు రైతు ప్రతినిధులు, నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలం ప్రారంభమై దాదాపు 94 రోజులు గడిచినా, ..మిగతా 2లో

# ఆంజనేయస్వామి విగ్రహం చోరీ

## ఎత్తుకెళ్లిన దుండగులు

సీసీ కెమెరాలో రికార్డైన దృశ్యాలు... రంగంలోకి టీటీడీ విజిలెన్స్

(తిరుమల - జయజయహే)



తిరుమల మొదటి ఘాట్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద విగ్రహం చోరీకి గురైంది. 7వ మైలు వద్ద ఉన్న ఆలయంలో హనుమంతుడి చిన్న విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. హనుమంతుడి విగ్రహాన్ని పెకలించి చోరీ చేసినట్లు తెలుస్తోంది. వేకువ జామున 3 గంటల సమయంలో ఈ ఘటనకు పాల్పడినట్లు సమాచారం. సీసీ కెమెరాలో రికార్డైన చోరీ దృశ్యాలపై ఆరా తీస్తున్న పోలీసులు కేసు ..మిగతా 2లో

# సీదిరి అప్పలరాజు అరెస్టు

## కాశీబుగ్గ నివాసంలో అదుపులోకి

పోలీసులను అడ్డుకున్న వైసీపీ శ్రేణులు

బలవంతంగా తీసుకెళ్లిన పోలీసులు

రోడ్డు ప్రమాదంలో సాక్ష్యాలు తారుమారు కేసు

ఇప్పటికే రిమాండ్ కుమారుడు అరవ్

(పలాస - జయజయహే)



వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని తన నివాసంలో పోలీసులు అప్పలరాజును అరెస్టు చేశారు. అరెస్ట్‌తో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆయనను ..మిగతా 2లో

# నేను అమాయకురాలిని

## ఆధారాలు లేకుండానే నేరం మోపారు

మీడియాకు లేఖలో కాదంబరి జెత్వాని

(అమరావతి - జయజయహే)



ముంబై నటి, మోడల్ కాదంబరి జెత్వాని తనపై నమోదైన కేసు, దర్యాప్తు అంశాలపై స్పందించారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, అమాయకురాలినని పేర్కొంటూ మీడియాకు ఓ లేఖ రాశారు. సీఐడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో తనపై సరైన ఆధారాలు లేకుండానే నేరం మోపారని కాదంబరి జెత్వాని పేర్కొన్నారు. తన బ్యాంకు ఖాతాలో జమ అయిన రూ.4.5 లక్షల మొత్తాన్ని రూ.1.32 కోట్లుగా ప్రచారం చేశారని ఆరోపించారు. కాగా.. వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్.. నటి జెత్వానిపై 2024 ఫిబ్రవరి 2న ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో వేధింపుల కేసు పెట్టిన సంగతి తెలిసిందే. జెత్వాని తనను బ్లాక్‌మెయిల్ చేసి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేశారంటూ విద్యాసాగర్ ఫిర్యాదు చేశారు. అయితే విద్యాసాగర్ తనను పెళ్లిచేసుకుంటానని చెప్పి నిరాకరించినందునే ..మిగతా 2లో



### తాగునీటి ఎద్దడికి

# ముందస్తు చర్యలు

## ఎల్ నినో ప్రభావంతో సమస్య రాకూడదు

సకాలంలో తాగునీరు ప్రాజెక్టులు పూర్తి చేయాలి

జల్ జీవన్ మిషన్ పనుల్లో అలసత్వం వద్దు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు

ఆర్ డబ్ల్యూఎస్ పై అధికారులతో సమీక్ష

(అమరావతి - జయజయహే)

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి ..మిగతా 2లో

### ప్రధాని మోడీ

# క్షమాపణలు చెప్పాలి


## మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

10 ఏళ్లలో 152 పేపర్ లీకేజీలు.. ఒక్కరికీ శిక్ష లేదు

విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు చేపట్టాలి

విపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



దేశంలో వరుసగా జరుగుతున్న క్వశ్చన్ పేపర్ లీకేజీలు, పరీక్షల కుంభకోణాలు, విద్యార్థుల ఆందోళనలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రస్తుత మోదీ ప్రభుత్వ హయాంలో భారత విద్యా వ్యవస్థ పూర్తిగా ధ్వంసమై, అవినీతిమయంగా మారిందని ఆరోపించారు. గడచిన 10 ఏళ్లలో ఏకంగా 152 పేపర్ లీకేజీలు జరిగాయని, సగటున నెలకు ఒక పేపర్ లీక్ అవుతున్నా ఇప్పటివరకు ఒక్కరిపై కూడా శిక్ష పడకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. ఈ సందర్భంగా దేశంలో దాదాపు 7.5 కోట్ల మంది విద్యార్థులు, వారి కుటుంబాల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చారని అన్నారు. విద్యా వ్యవస్థను సంస్కరించడానికి , నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయడానికి మూడు స్పష్టమైన, ప్రధాన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ..మిగతా 2లో

# 24న స్కూల్స్ బంద్

## విద్యార్థి సంఘాల పిలుపు

నీట్ ఆందోళకారులపై లాఠిచార్జికి నిరసన

(అమరావతి - జయజయహే)



విద్యా రంగాన్ని కుదిపేస్తున్న నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ ఉదంతం తీవ్ర వివాదానికి దారితీసింది. పరీక్షా నిర్వహణలో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జులై 24న వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును సమస్యల్లోకి నెట్టేసిన పేపర్ లీకేజీల సంస్కృతిని అరికట్టాలని ప్రధాన విద్యార్థి, ..మిగతా 2లో

For a pure tomorrow.. జయహో

# బాబు వల్లే పొగాకు రైతులకు కష్టాలు

మొదటి పేజీ తరువాయి...

పండిన 232 మిలియన్ కిలోల పొగాకులో కేవలం 16.5 శాతం మాత్రమే కొనుగోలు చేయడం ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. సెప్టెంబరులో కర్ణాటకలో వేలం మొదలైతే ఇక్కడి రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు మద్దతుగా వచ్చే వారం పది రోజుల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని గోపాలపురం, జంగారెడ్డిగూడెంలో పర్యటించి ఆందోళనలు చేపడతానని, ప్రభుత్వం స్పందించకపోతే కందుకూరులోనూ పర్యటిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించి పొగాకు ధర రూ.200కు తగ్గకూడదని హెచ్చరించిన మరుసటి రోజే మార్కెట్లో ధరలు దారుణంగా పడిపోయాయని జగన్ ఆరోపించారు. పొదిలి, టంగుటూరు, కనిగిరి, కందుకూరు, గోపాలపురం తదితర ప్రాంతాల్లో రూ.130 నుంచి రూ.186 మధ్యలోనే కొనుగోలు చేయడం వ్యాపారుల సిండికేట్ ఎంత బలంగా ఉందో తెలియజేస్తోందన్నారు. వ్యాపారులు నో బిడ్లు పెడుతూ, బేళ్లను తిరస్కరిస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నా ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తోందని విమర్శించారు. నిబంధనలు పాటించని కంపెనీలపై ఒక్క కేసు నమోదు చేయలేదని, లైసెన్సులను సస్పెండ్ చేయకపోవడం వల్లనే వ్యాపారులకు భయం లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. తన హయాంలో రైతుల రక్షణ కోసం అమలు చేసిన విప్లవాత్మక చర్యలను ఈ సందర్భంగా జగన్ గుర్తుచేశారు. వైయస్సార్సీపీ ప్రభుత్వంలో దేశంలోనే తొలిసారిగా మార్క్‌ఫెడ్ ను పొగాకు వేలం ప్లాట్‌ఫారమ్‌పైకి తీసుకొచ్చి కొనుగోళ్ళు చేపట్టామని, దీనివల్ల వ్యాపారుల సిండికేట్ విచ్ఛిన్నమై పోటీ పెరిగి రైతులకు గిట్టుబాటు ధరలు దక్కాయని పేర్కొన్నారు.



అలాగే రూ.3,000 కోట్లతో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ ఏర్పాటు చేసి, ఐదేళ్లలో పంటల కొనుగోళ్ల కోసం రూ.7,800 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ప్రతి రైతుభరోసా కేంద్రాన్ని వ్యవసాయ ధరల పర్యవేక్షణ కేంద్రంగా మార్చి, సీఎం యాప్ ద్వారా ప్రతికూల ధరలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో తక్షణమే కొనుగోళ్లు జరిపించామని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను కొనుగోళ్లలోకి రానివ్వకుండా అడ్డుకోవడమే వ్యాపారుల సిండికేట్‌కు కొమ్ముకాయడమేనని జగన్ ఆరోపించారు. నిద్రపోతున్న ప్రభుత్వాన్ని లేపడం సులభం, కానీ నిద్ర నటిస్తున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని లేపాలంటే గట్టిగా ఒత్తిడి తీసుకురావాల్సిందే అని వ్యాఖ్యానించారు. రైతుల బాగు కోరే ప్రజా ప్రభుత్వం వచ్చేవరకు తాము విశ్రమించబోమని, పొగాకు రైతులకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే మార్కెట్‌లో జోక్యం చేసుకుని, హామీ ఇచ్చిన ధరలకు పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ జిల్లాలో ఏ పంట రైతు ఇబ్బంది పడుతున్నా వైయస్సార్సీపీ అండగా నిలుస్తుందని జగన్ భరోసా ఇచ్చారు. ఏదో ఒక ధరకు మా పంట కొని మమ్మల్ని బతికించండి అని రైతులు దేహీ అని వేడుకునే దుస్థితికి ప్రభుత్వాధినేతల నిర్లక్ష్యమే కారణమన్నారు. వ్యాపారులకు లాభాలు చేకూర్చే ధోరణి వీడి, తక్షణమే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు రైతులకు న్యాయం చేయకపోతే రాబోయే రోజుల్లో ప్రజా నిరసనల సెగ ప్రభుత్వాన్ని తాకడం ఖాయమని స్పష్టం చేశారు.

# ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాలి

మొదటి పేజీ తరువాయి...



ముందు ఉంచారు. విద్యావ్యవస్థలోని అస్తవ్యస్తతకు, వరుస పేపర్ లీకేజీలకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధానే ప్రధాన బాధ్యుడని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆయనను అత్యంత అసమర్థుడు , అవినీతిపరుడు గా అభివర్ణిస్తూ, ఈ సంక్షోభానికి కారణం అయిన ఆయనను కేంద్ర కేబినెట్ నుంచి తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా తమ భవిష్యత్తు కోసం నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు విచక్షణారహితంగా విరుచుకుపడటాన్ని రాహుల్ తీవ్రంగా ఖండించారు. ఆందోళనకారులపై దాడికి పాల్పడిన పోలీసు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, విద్యార్థులను అణచివేసే చర్యలకు నిరసనగా ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా విద్యార్థి లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో కేవలం ధనవంతులకే చదువు దక్కేలా విద్యా వ్యవస్థ వ్యాపారీకరణ చెందిందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ కోచింగ్ కోసమే దేశంలో ఏటా రూ. 1.32 లక్షల కోట్లు ఖర్చవుతోందని, ఇది దేశ మొత్తం విద్యా బడ్జెట్ కు దాదాపు సమానంగా ఉందని గణాంకాలతో సహా వివరించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులను దూరం చేసేలా మారిన ఈ మాఫియా ఆధారిత కొనుగోలు వ్యవస్థను రద్దు చేసి, సమగ్ర సంస్కరణలు చేపట్టాలని కోరారు. ప్రధాని నివాసం ఎదుట జరిగిన ధర్నాలో పోలీసులు తనను నెట్టివేయడం లేదా లాఠీలతో లాగడంపై విలేకరులు ప్రశ్నించగా, రాహుల్ గాంధీ హుందాగా స్పందించారు. నన్ను ప్రభుత్వం ఎలా చూస్తుందనేది, కొన్ని దెబ్బలు తిన్నానా లేదా అనేది నాకు ముఖ్యం కాదు. విద్యార్థుల గొంతుకగా నిలవడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. నా వ్యక్తిగత విషయం కంటే కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు, వారి నిరసనే నేడు దేశానికి అత్యంత ప్రాధాన్యమైన అంశం అని స్పష్టం చేశారు. ఈ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు అండగా నిలుస్తుందని, పేపర్ లీకేజీల మాఫియా అంతమయ్యే వరకు , అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు తమ నిరసనలు ఆగేది లేదని హెచ్చరించారు. దేశంలోని ప్రతిభావంతులైన యువత ఆశలను ఆవిరి చేస్తున్న ఈ సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే పార్లమెంట్ వేదికగానూ, రోడ్లపైనూ ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని విపక్ష నేత హెచ్చరించారు.

## తాగునీటి ఎద్దడికి

# ముందస్తు చర్యలు

మొదటి పేజీ తరువాయి...

సారించాలని సూచించారు. జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధార పథకంలో భాగంగా పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకాల పనులు నిర్ణీత గడువులోపు పూర్తి కావాలని ఆదేశించారు. మెగా వాటర్ గ్రిడ్ పథకాల పనుల పురోగతిపై గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో పవన్ సమీక్షించారు. పనుల పురోగతిని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు. రూ. 1,290 కోట్ల అంచనా వ్యయంతో ప్రకాశం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో, 593 ఆవాసాలకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించిన ప్రకాశం మెగా వాటర్ గ్రిడ్ పథకానికి సంబంధించి ఇంటేక్ వెల్ నిర్మాణం పనులు 40 శాతానికి పైగా పూర్తయినట్లు అధికారులు తెలిపారు. 119 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్ పనులు, సంపులు, గ్రౌండ్ లెవల్ బ్యాలెన్స్ రిజర్వాయర్ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. పథకం కింద ఇప్పటి వరకు 53 కిలోమీటర్ల మేర పైపు లైన్ల నిర్మాణం పూర్తి చేసినట్టు వివరించారు. అలాగే రూ. 1,200 కోట్లతో చేపట్టిన పల్నాడు వాటర్ గ్రిడ్ పథకంలో 152 కిలోమీటర్ల మేర పైపు లైన్ పనులు పూర్తయినట్లు చెప్పారు. ఇన్ టేక్ వెల్స్, రిజర్వాయర్లు, ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం పనులు కూడా పురోగతిలో ఉన్నట్టు తెలిపారు. ఇప్పటికే రూ. 95 కోట్లు విలువ చేసే పనులు పూర్తి చేసినట్టు తాగునీటి సరఫరా విభాగం అధికారులు వివరించారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ “తాగు నీటి సమస్యతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న పల్నాడు, ప్రకాశం ప్రాంతాల ప్రజలకు ఈ ప్రాజెక్టులు జీవనాధారం. నిర్ణీత గడువులోపు ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేసి, లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఇంటికీ తాగు నీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలి. గ్రామాల మధ్య పైపు లైన్ల నిర్మాణం, అటవీ అనుమతులు లాంటి సమస్యలు ఉంటే తక్షణం పరిష్కరించాలి. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా నిర్మాణ కార్యకలాపాలను సాధ్యమైనంత వేగంగా చేయాలి” అని సూచించారు. ఆరోగ్యం పూర్తిగా కోలుకున్న తర్వాత పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తానని పవన్ తెలిపారు. జల్ జీవన్ మిషన్ పనుల్లో అలసత్వానికి తావివ్వొద్దని స్పష్టం చేశారు.

# 24న స్కూల్స్ బంద్

మొదటి పేజీ తరువాయి...

యువజన సంఘాలు ధ్వజమెత్తాయి. ఈ క్రమంలో ఎస్ ఎఫ్ ఐ , పీడీఎస్ యూ , ఏఐఎస్ ఏ , ఎన్ ఎస్ యూ ఐ , డీవైఎఫ్ ఐ, ఏఐవైఎఫ్ వంటి ప్రధాన సంఘాల రాష్ట్ర కమిటీలు ఐక్యంగా పోరాటానికి సిద్ధమయ్యాయి. బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరాయి. నీట్ పేపర్ లీకేజీ అక్రమాలకు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి స్వచ్ఛందంగా తప్పుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. భవిష్యత్తులో లీకేజీలు జరగకుండా అత్యంత పారదర్శకమైన పరీక్షా విధానాన్ని తీసుకురావాలని పేర్కొన్నాయి. లీకేజీల వెనుక ఉన్న అసలు సూత్రధారులపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయాలి. జులై 24న జరిగే బంద్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కాలేజీలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు, అధ్యాపకులు, యాజమాన్యాలు భాగస్వాములై విజయవంతం చేయాలని సంఘాలు కోరాయి. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో 'కాక్రోచ్ జనతా పార్టీ' నిరసన కొనసాగుతోంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యాన్ని ఎండగడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలు ప్రాంతాల్లో వినూత్న నిరసన ప్రదర్శనలు చేపట్టారు. విద్యా వ్యవస్థలో పేరుకుపోయిన అవినీతిని ఏరిపారేయాలని, విద్యార్థుల కష్టాన్ని బ్రోకర్లకు విక్రయించే వ్యవస్థను బూడిద చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా సీజేపీ ప్రతినిధి బృందానికి, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు మధ్య జరిగిన సమావేశం అసంపూర్తిగా ముగియగా జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనలు కొనసాగుతున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు నిరసనలు కొనసాగుతాయని సీజేపీ జనతా పార్టీ ప్రకటించింది.

# సీదిరి అప్పలరాజు అరెస్టు

మొదటి పేజీ తరువాయి...

అరెస్టు చేయకుండా వైసీపీ కార్యకర్తలు పోలీసులను అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. అప్పలరాజును అరెస్ట్ చేయవద్దంటూ వైసీపీ నేతలు భారీగా తరలివచ్చారు. పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేయగా, ఆ ప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. చివరకు పోలీసులు అప్పలరాజును బలవంతంగా అరెస్టు చేసి తీసుకెళ్లారు. రోడ్డు ప్రమాదం కేసు నుంచి కుమారుడిని తప్పించే ప్రయత్నం చేశారని అప్పలరాజుపై కేసు నమోదైంది. సాక్ష్యాలు తారుమారు చేశారని సీదిరిపై ఆరోపణలు ఉన్నాయి. విచారణ నిమిత్తం కాశీబుగ్గ పీఎస్‌కు తరలించారు పోలీసులు. ఇప్పటికే ఆయన కుమారుడు ఆరవ్ రిమాండ్‌లో ఉన్నారు. ఇప్పటికే ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం అప్లై సీదిరి చేశారు.

# ఆంజనేయస్వామి విగ్రహం చోరీ

మొదటి పేజీ తరువాయి...

నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రసన్న ఆంజనేయ స్వామి విగ్రహ సమీపంలో ఉన్న సిసి ఫుటేజ్ లను పరిశీలిస్తున్నారు. స్థానికంగా ఉన్న దుకాణాల్లో ఏర్పాటు చేసిన కెమెరాల్లో రికార్డ్ అయిన ఫుటేజ్ ఆధారంగా అనుమానితుడి కోసం గాలిస్తున్నారు. గోవింద మాల ధరించిన భక్తులు అడుగు ఎత్తు ఉన్న చిన్న సైజు హనుమంతుడి విగ్రహాన్ని పెకిలించి బ్యాగ్‌లో ఎత్తుకెళ్లినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు టిటిడి విజిలెన్స్ సిబ్బందితో కలిసి 10 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అనుమానితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

**మహా అపచారం..**

తిరుమల మొదటి ఘాట్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద విగ్రహం చోరీపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి స్పందించారు. ఇది మహా అపచారమన్నారు. టీటీడీ యంత్రాంగం ఏం చేస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, టిటిడి పాలక మండలి సమాధానం చెప్పాలన్నారు. నిత్యం వేలాది మంది భక్తులతో ఎన్నో ఏళ్లుగా ఆంజనేయ స్వామి అక్కడ పూజలందుకుంటున్నారన్నారు. స్వామి వారి విగ్రహం మాయమైనా గుర్తించలేక పోయారని టిటిడి మాజీ చైర్మన్ భూమన ఆరోపించారు.

# నేను అమాయకురాలిని

మొదటి పేజీ తరువాయి...

తనను వేధింపులకు గురిచేస్తున్నాడని నటి కాదంబరి జెత్వానీ గతంలో చెప్పారు. నాటి విజయవాడ సీపీ కాంతిరాణా తనను అక్రమంగా కేసులో ఇరికించారని, పోలీసులు తీవ్రంగా వేధింపులకు గురి చేశారని.. సుమారు 45 రోజులపాటు తన జీవితాన్ని దుర్భరం చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జెత్వాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తరువాత ఆ కేసును సీఐడీకి బదలాయించారు. జెత్వాని బెదిరింపులకు దిగి విద్యాసాగర్ నుంచి దఫదఫాలుగా డబ్బు వసూలు చేసినట్లు సీఐడీ నిర్ధారించి.. విజయవాడ ఏడో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఇటీవల ఛార్జిషీటు దాఖలు చేసింది. ఈ కేసులో జెత్వాని మినహా ఆమె తల్లిదండ్రులు, సోదరుణ్ని నిందితుల జాబితా నుంచి తొలగిస్తున్నామని, ఇందుకు అనుమతించాలని సీఐడీ అధికారులు తమ పిటిషన్‌లో అభ్యర్థించారు. దీనిపై ఫిర్యాదుదారుకు నోటీసివ్వాలని కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.





## వైమానిక ప్రస్థానంలో

# సరికొత్త శకం..!

### ప్రారంభానికి సిద్ధమైన భోగాపురం ఎయిర్పోర్ట్

(విజయనగరం, జయ జయహే)

భారతీయ విమానయాన రంగంలో మరో అద్భుతమైన చరిత్రను ఆవిష్కరించేందుకు రంగం సిద్ధమైంది. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరుస్తూ, భోగాపురం వద్ద అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకున్న 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ఆగస్టు 1 న జాతికి అంకితం కానుంది. దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నారు. ఈ విమానాశ్రయం కేవలం ఒక రవాణా కేంద్రం మాత్రమే కాదు; ఇది ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థిక వృద్ధికి, పారిశ్రామికాభివృద్ధికి, ఉపాధి అవకాశాల సృష్టికి ఒక తిరుగులేని వారధిగా నిలవనుంది.

**అత్యుత్తమ మౌలిక వసతులు - ప్రత్యేకతలు...!**

ప్రముఖ విమానాశ్రయ సంస్థ జీఎంఆర్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకుంది. భారీ విమానాలు సైతం సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా 3,800 మీటర్ల పొడవు గల 'కోడ్ 4ఈ' రన్‌వేను ఏర్పాటు చేశారు. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణీకులకు సేవలందించే సామర్థ్యంతో ప్రారంభమవుతుండగా, భవిష్యత్తులో దశలవారీగా దీనిని 4 కోట్ల మందికి పైగా విస్తరించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రత్యేక కార్గో సదుపాయాలు ఉండటం వల్ల స్థానిక ఎగుమతులకు ఎంతో ఊతం లభిస్తుంది.

**చట్టబద్ధమైన అనుమతులు పూర్తి...!**

ప్రారంభోత్సవం అనంతరమే కాకుండా, తక్షణమే వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా ఈ విమానాశ్రయం అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులను సాధించింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి ఏరోడ్రోమ్ లైసెన్స్, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆమోదాలు, ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్ మరియు కస్టమ్స్ నోటిఫికేషన్‌లు, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుండి క్లియరెన్స్‌లు జారీ అయ్యాయి.

**ప్రాంతీయ అనుసంధానం - ఆర్థిక విప్లవం**

భోగాపురం విమానాశ్రయం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో బాటు దక్షిణ ఒడిశా మరియు ఛత్తీస్‌గఢ్‌లోని సరిహద్దు జిల్లాల ప్రజలకు ప్రధాన విమానయాన మార్గంగా మారుతుంది. ప్రయాణీకులు సులభంగావిమానాశ్రయానికి చేరుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖపట్నం నుంచి ఇప్పటికే 7 అప్రోచ్ రోడ్లతో కూడిన అధునాతన హైవే కనెక్టివిటీని అందుబాటులోకి తెచ్చాయి. ఇతర జిల్లాలనుంచి కూడా అనుసంధానానికి ప్రణాళికలను రూపొందించారు.ఇన్నాళ్ళూ వెనుకబడ్డ జిల్లాగా ముద్ర పడ్డ విజయనగరం జిల్లా...ఆ ముద్రను తుడిచేసుకుని, రాష్ట్రానికి వెన్నుముక జిల్లాగా మారేందుకు భోగాపురం విమానాశ్రయం సరికొత్త బాటను వేస్తుందనడంలో సందేహం లేదు.

## భూములకు

# ఇక శాశ్వత భద్రత

### మీ భూమి - బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ప్రాజెక్టు

### సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా డిజిటలైజేషన్

### వర్చువల్ గా ప్రారంభించనున్న చంద్రబాబు

(అమరావతి - జయజయహే)

భూ రికార్డుల నిర్వహణలో సాంకేతిక విప్లవానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భూ వివరాలకు శాశ్వత భద్రత కల్పించే లక్ష్యంతో రూపొందించిన 'మీ భూమి--బ్లాక్ చెయిన్' పైలట్ ప్రాజెక్ట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. భూ రికార్డులకు 'సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్'గా పనిచేసేలా ఈ వ్యవస్థను రూపొందించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో ఏడు జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా పాల్గొననున్నారు. తొలి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఎంపిక చేసిన ఏడు మండలాల్లో ఈ పైలట్ ప్రాజెక్ట్ అమలు కానుంది. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ ద్వారా భూ రికార్డులు డిజిటలైజ్ అయినప్పటికీ, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో సమాచారం వేర్వేరుగా ఉండటం వల్ల డేటా వ్యత్యాసాలు, రికార్డుల మార్పుల విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా బ్లాక్‌చెయిన్ ఆధారిత వ్యవస్థను అభివృద్ధి చేశారు. చీ×జ ఆంధ్రప్రదేశ్, చీ×జ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీ ఆధారంగా ఈ వ్యవస్థను రూపొందించాయి. ఇందులో ప్రతి భూ పార్సెల్‌కు ప్రత్యేకమైన బ్లాక్‌చెయిన్ గుర్తింపు కల్పిస్తారు. భూమికి సంబంధించిన ప్రతి లావాదేవీ టాంపర్ ప్రూఫ్ విధానంలో శాశ్వతంగా రికార్డు అవుతుంది. ఈ విధానం ద్వారా భూ రికార్డుల్లో మార్పులు చేయడం పూర్తిగా నియంత్రిత ఆన్‌లైన్ ప్రక్రియగా మారనుంది. ఏ అధికారి ఎప్పుడు ఏ మార్పు చేశారనే వివరాలు కూడా శాశ్వతంగా నమోదవుతాయి. రికార్డుల్లో ఏదైనా వ్యత్యాసం కనిపిస్తే లావాదేవీని వెంటనే నిలిపివేసే విధంగా వ్యవస్థను రూపొందించారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో తొలి దశలో ఆటో మ్యూటేషన్, సబ్-డివిజన్, ఎక్స్‌టెంట్ కరెక్షన్ వంటి ఎనిమిది పౌర సేవలు అందుబాటులోకి రానున్నాయి. మొదటి దశలో అస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల్లో ఈ ప్రాజెక్ట్ అమలు చేయనున్నారు. మొత్తం 89 రీ-సర్వే గ్రామాలు, 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు ఇందులో భాగం కానున్నాయి. వ్యవసాయం, మత్స్యశాఖ, గనులు, పరిశ్రమలు, విద్యుత్ శాఖ, సీఆర్‌డీఏ, ఆర్థిక సంస్థలు వంటి పలు విభాగాలు అవసరమైన మేరకు ఈ భూ సమాచారాన్ని వినియోగించుకునే అవకాశం ఉంటుంది. భూ మోసాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు, వేగవంతమైన, పారదర్శకమైన పౌర సేవలు అందించడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది.

# ప్రతి ఇంటికీ గోదావరి శుద్ధి జలాలు

## రూ.94.31 కోట్ల అమృత్--2.0 తాగునీటి ప్రాజెక్టుకు మంత్రి శంకుస్థాపన.

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు పట్టణ ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం అమృత్--2.0 పథకం కింద రూ.94.31 కోట్ల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి ప్రాజెక్టు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రొక్లెయిన్ ఎక్కి స్వయంగా మట్టి తొలగించి పనులను ప్రారంభించారు.సభలో మంత్రి మాట్లాడుతూ, 2027 డిసెంబర్ 31 నాటికి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి, 2028 జనవరి నుంచి నిడదవోలులోని ప్రతి ఇంటికీ పైప్‌లైన్ ద్వారా శుద్ధి చేసిన గోదావరి జలాలను అందిస్తామని తెలిపారు.ప్రాజెక్టులో భాగంగా ధవళేశ్వరం నుంచి గ్రిడ్ లైన్ ద్వారా నీటి సరఫరా, 10 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రం, రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు, పట్టణవ్యాప్తంగా 90 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే 20 కిలోమీటర్ల పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు.అదనంగా ఎన్టీఆర్ నగర్‌కు ప్రత్యేక నీటి



సరఫరా పథకం, మాలకోడు చెరువు పునరుద్ధరణ పనులు కూడా చేపడుతున్నట్లు వివరించారు. చెరువులో పూడికతీత, కొత్త కట్ట నిర్మాణం, రక్షణ కంచె, వాకింగ్ ట్రాక్, ఫౌంటెన్ వంటి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై మంత్రి విమర్శలు గుప్పిస్తూ, గోదావరి ఒడ్డున ఉన్నప్పటికీ ప్రజలకు తాగునీరు అందించడంలో విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో ప్రాజెక్టును తిరిగి



ప్రారంభించామని పేర్కొన్నారు.పట్టణ అభివృద్ధికి రూ.196 కోట్లు, గ్రామీణ రహదారులకు రూ.28 కోట్ల నిధులు తీసుకొచ్చామని తెలిపారు. పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రాష్ట్రస్థాయిలో 50 వేల జనాభా విభాగంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అవార్డుల్లో నిడదవోలు మున్సిపాలిటీకి ప్రథమ బహుమతి లభించడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, సిబ్బందిని అభినందిస్తూ అవార్డును ప్రజలకు ప్రదర్శించారు.తాగునీటి ప్రాజెక్టును అధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతరం పర్యవేక్షించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి సూచించారు.




## స్మశాన వాటికకు శంకుస్థాపన

**మాడుగుల జూలై 22 జయ జయహే**

మాడుగుల గ్రామంలో గల పాలగడ్డ జలాశయం సమీపంలో ఐదు లక్షల రూపాయల జడ్పీ నిధులతో స్మశాన వాటిక నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. మాజీ ఉ ప ముఖ్యమంత్రి బోడి ముత్యాల నాయుడు, జడ్పీ చైర్మన్ జల్లి సుభద్ర, జడ్పిటిసి కే రమణమ్మ సూచనల మేరకు స్మశాన వాటిక నిర్మిస్తున్నామని మాజీ ఎంపీపీ వి రామధర్మజ చెప్పారు. వైసిపి మాటలు చెప్పే ప్రభుత్వం కాదని చేతలులో పనిచేసి చూపించే పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వై కళావతి, మాజీ ఉపసర్పంచ్ ఎస్ శ్రీనివాసరావు, వైసిపి నాయకులు బి శ్రీనివాసరావు, కే శ్రీధర్, ఎస్ సత్తిబాబు, వై హేమంత్ పాల్గొన్నారు



## వెంకటేశ్వర అవతారంలో దర్శనమిచ్చిన జగన్నాథుడు

**చోడవరం జులై 22 జయ జయహే**

జగన్నాథ స్వామి వారి రథోత్సవంలో భాగంగా స్వామివారు పది రోజులపాటు దశావతారంలో భక్తులకు దర్శనం ఇస్తారు.దానిలో భాగంగా బుధవారం స్వామివారు శ్రీ వెంకటేశ్వర స్వామి అవతారం లో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు వెంకట జగన్నాధుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



## నర్సరీ వేదికగా పాత్రికేయ ఐక్యత

**రాజమహేంద్రవరం:జయ జయహే :జూలై 22**

కడియం ప్రెస్ క్లబ్‌ల మధ్య స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేస్తూ కడియంలోని ఆహ్లాదకరమైన నర్సరీల్లో పాత్రికేయ నాయకులు సందడి చేశారు. కడియం ప్రెస్ క్లబ్ ఆహ్వానం మేరకు కడియపులంక మాజీ ఉపసర్పంచ్ పాఠంశెట్టి రాంజీ నర్సరీని సందర్శించి రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు అక్కడి పచ్చదనాన్ని, ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోత విజయసారథి, కార్యదర్శి గోపి మాట్లాడుతూ, నిత్యం పచ్చని మొక్కల మధ్య విధులు నిర్వహించే కడియం పాత్రికేయులు అదృష్టవంతులని కొనియాడారు. పచ్చని వాతావరణం మానసిక ప్రశాంతతకు నిలయమని పేర్కొన్నారు. అనంతరం రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోత విజయసారథి, కార్యదర్శి గోపి, ఉపాధ్యక్షుడు గంగాధర్, సంయుక్త కార్యదర్శి కృపానందం, సభ్యులు సీసీసీ గోపాలకృష్ణ, ఆకుల ఈశ్వర్, మధు, పాలపర్తి శ్రీనివాస్, చంటిలకు కడియం ప్రెస్ క్లబ్ సభ్యులు శాలువాలు కప్పి, అరెలియా మొక్కలు అందజేసి ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో కడియపులంక మాజీ సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ, సీనియర్ జర్నలిస్టు బెజవాడ గౌరీశంకర్, కడియం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సూరిబాబు, కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్, దూడల అర్జున్, శెట్టి పోసిబాబు, కొప్పిశెట్టి సుబ్రమణ్యం, పేపకాయల బుజ్జి, పాలగుమ్మి శేషగిరి, పల్ల వెంకటగిరి, అడ్డగళ్ళ దుర్గాప్రకాష్, అడ్డగళ్ళ రాము, యడ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం కడియం ప్రెస్ క్లబ్ అభివృద్ధి కార్యక్రమాలను అధ్యక్షుడు సూరిబాబు రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి వివరించారు. జర్నలిస్టుల సంక్షేమమే ప్రెస్ క్లబ్‌ల ప్రధాన లక్ష్యంగా ఉండాలని, అలా పనిచేసినప్పుడే కార్యవర్గాలకు గౌరవం, గుర్తింపు లభిస్తాయని మోత విజయసారథి గోపి పేర్కొన్నారు.



## పంచముఖి ఆంజనేయ ఆలయ నిర్మాణానికి 65,000 విరాళం

**మాడుగుల జూలై 21 జయ జయహే**

మాడుగుల మండలం ఎం కోడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ మోదకొండమ్మ వారి ఆలయం ప్రాంగణంలో నిర్మిస్తున్న పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయ నిర్మాణానికి దాతలు 65 వేల రూపాయలు విరాళం అందించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ జి సంజీవరావు బుధవారం తెలిపారు. వీటిలో భాగంగా ఎం కోడూరు కు చెందిన మొండేపు నాయుడు, ఉ పేంద్ర దంపతులు ఈ మొత్తాన్ని అందజేశారని తెలిపారు. వారిని ఆలయ కమిటీ తరపున అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ శర్మ, ఎంపీటీసీ ముమ్మిడి రమణబాబు, గుమ్మల లోవ లక్ష్మి, చల్లా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




## పంటల బీమా, పీఎం ఎఫ్బి వై పథకాలు సద్వినియోగించుకోండి

**మాడుగుల జూలై 22 జయ జయహే**

మాడుగుల మండలం శంకరం, తాటిపర్తి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి అనసూయపంటల భీమా గురించి వివరించారు. అలాగే పి ఎం ఎఫ్ బి వై పథకం లో వరి పంటకు రైతులు 2% ప్రీమియం ఎకరాకు 84 రూపయాలు మాత్రం చెల్లించి భీమా పొందడం వలన ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరిగినపుడు భీమా అనేది అండగా ఉంటాదన్నారు రైతులు పి ఎం ఎఫ్ బి వై పోర్టల్ లో స్వయంగా నమోదు చేసుకోవచ్చున్నారు. లేదా కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా చేసుకోవచ్చున్నారు. లోన్ తీసుకున్న రైతులు సంబంధిత బ్యాంకు ద్వారా ఈ పథకాన్ని పొందవచ్చున్నారు. ఆగస్టు 15న లోగా లబ్ధిదారులు ఈ పథకంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో యూరియా, డి ఏ పి అందుబాటులో వున్నదని అవసరమైన రైతులు వినియోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో కొండంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు ఎం కిషోర్, ఆత్మ బిటియం కే కిషోర్ పాల్గొని సమగ్ర ఎరువుల యజమాన్యం గురించి వివరించారు.

## పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల విన్నతుల స్వీకరణ

**అనకాపల్లి జయ జయహే**



అనకాపల్లి స్థానిక రింగ్ రోడ్డు లో గల జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ ప్రజలు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు నుండి వారి సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను నియోజకవర్గ ఇన్చార్జి బీమర్ శెట్టి రామ్కీ వారి సమస్యలను సానుకూలంగా స్పందించి వారి వద్ద నుంచి వినతి పత్రాలు స్వీకరించి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లి మీ సమస్యల త్వరలోనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని వారికి ఆమె ఇవ్వడం జరిగింది. ప్రజాస్వామస్యలు పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆయన తెలియజేశారు



## మామిడి రైతుల క్రాప్ ఇన్సూరెన్స్ బకాయిలు విడుదల చెయ్యండి

### వ్యవసాయ శాఖ డైరెక్టర్ కు లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి వినతి

**మంగళగిరి జులై 22: (జయ జయహే)**

రాష్ట్రంలోని విజయనగరం, చిత్తూరు జిల్లాల మామిడి, జీడీ మామిడి రైతుల 2024,25 సంవత్సరం క్రాప్ ఇన్సూరెన్స్ బకాయిలు సుమారు 18 వేల మందికి అందలేదని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చెయ్యాలని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమాన్ ని కోరారు బుధవారం మంగళగిరి డైరెక్టర్ కార్యాలయంలో ఆయనకి వినతిపత్రం అందచేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విజయనగరం జిల్లా లో 10,104 మంది మామిడి రైతులు 6,358.38 ఎకరాలకు క్రాప్ ఇన్సూరెన్స్ 2024,25 లో చేయించారని జీడీ మామిడి రైతులు 566 మంది 378.70 ఎకరాలకి ఇన్సూరెన్స్ చేయించుకున్నారని ఫసల్ భీమా యోజన(వాతావరణ ఆదారితా భీమా రభీ )పథకంలో చేసుకున్నా ఫలితం దక్కక రైతులు ఆందోళన చెందుతున్నారని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా లో కూడా రైతుల పరిస్థితి కూడా ఇలానే ఉందని రాష్ట్ర ప్రభుత్వం రైతుల పరిస్థితి అర్ధం చేసుకొని మామిడి, జీడీ రైతులను ఆదుకునే ప్రయత్నం చెయ్యాలని భీశెట్టి బాబ్జి కోరారు,ఈ కార్యక్రమం లో రైతు నాయకుడు పెనుమత్స రామకృష్ణ రాజు పాల్గొన్నారు



## రాహుల్‌పై దాడి ఖండిస్తూ భారీ ర్యాలీ!"

**రాజమహేంద్రవరం: జయ జయహే :జూలై 22:**

ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసానికి శాంతియుత ర్యాలీగా వెళ్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై దాడి జరగడం ప్రజాస్వామ్య విలువలపై జరిగిన ఘోరమైన దాడేనని రాజమహేంద్రవరం కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు లిబాలేపల్లి మురళీధర్‌లి, రాజమహేంద్రవరం పార్లమెంట్ కోఆర్డినేటర్ టి కె విశ్వేశ్వరరెడ్డి పిసిసి ప్రధానకార్యదర్శులు ఆకుల భాగ్యలక్ష్మితాళ్లూరి విజయకుమార్ మాట్లాడారు. దేశ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, ప్రశ్నపత్రాల లీకేజీలు, నియామకాలలో జరుగుతున్న అవకతవకలపై పార్లమెంట్‌లో చర్చించాలని కోరితే స్పీకర్ తిరస్కరించడం దారుణమన్నారు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షానికి రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును కాలరాస్తూ రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంకా గాంధీలను అమానుషంగా అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మోదీ, అమిత్‌షా కలిసి అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారని దుయ్యబట్టారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి లిధర్మేంద్ర ప్రధాన్‌లి తన పదవికి తప్పుకోవాలని, ఆయనను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు నిర్వహించే ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఉ ంటుందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ గద్దె దిగే వరకు కాంగ్రెస్ పోరాటం ఆగదని హెచ్చరించారు.సమావేశం అనంతరం కాంగ్రెస్ నాయకులు ప్రెస్‌క్లబ్ నుంచి గణేష్ చౌక్ మీదుగా జాంపేటలోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్ ,తాడి సూరిబాబు,బర్రే సుబ్రహ్మణ్యం, కిశోర్‌కుమార్ జైన్, సాకా పుల్లారావు, సింధియా రాణి, యర్రా రామకృష్ణ, జయలలిత, తాడేపల్లి ప్రశాంత్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




## కొనసాగిన దస్తావేజు లేఖరుల నిరసన

**అనకాపల్లి జయ జయహే**

జీవో నెంబర్ 396 రద్దు చేయాలని కోరుతూ అనకాపల్లి దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష శిబిరం మూడవ రోజు కూడా కొనసాగింది ఈ శిబిరానికి వైఎస్ఆర్ పార్టీ నాయకులు మలసాల భరత్ హాజరు కావడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 396 మూలంగా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు రోడ్డున పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఈ జీవోను రద్దు చేయాలని లేదా పునరాలోచన చేసి దస్త లేఖరులు వారికి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీక్షా శిబిరంలో ఉన్న దస్తా లేఖరులు వారి నందరిని వైయస్సార్ పార్టీ నాయకులు మల్లపురెడ్డి కోటేశ్వరరావు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు వైఎస్ఆర్ పార్టీ కార్యకర్తలు అభిమానులు పలు పార్టీ నాయకులు వారికి సంఘీభావం తెలపడం జరిగింది



# శూన్య మాసంలో ప్రారంభోత్సవమా!

## భోగాపురం ప్రారంభోత్సవం వాయిదా వేయాలి

## ప్రధాని మోడీకి తెలుగు శక్తి లేఖ

## ప్రారంభోత్సవం ప్రభుత్వానికి మంచిది కాదు

## తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

**విశాఖపట్నం, జూలై 22, జయ జయహే**

విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం వాయిదా వేయాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1న విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని వాయిదా ఎయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి లేఖ కూడా రాసానన్నారు. సాంప్రదాయం ప్రకారం ఆషాఢ మాసంలో శుభకార్యాలు, నూతన ప్రారంభోత్సవాలు వంటి శుభకార్యాలు చేయకూడదనే నమ్మకం ఉందని, జ్యోతిష్య పరంగా ముహూర్తాలు లేని కాలం కావడంతో దీనిని 'శూన్య మాసం' అని కూడా అంటారు, అలాంటి రోజున ఆషాడం మాసం రావడం అశుభమని, హిందూ మతాన్ని ఎక్కువగా అనుసరించేవారు కాబట్టి, ప్రారంభోత్సవాలు ఈ సమయంలో తలపెట్టకూడాదని, ఇది సమాజానికి, ప్రభుత్వానికి మంచిది కాదని తెలుపుతూ విమానాశ్రమం ప్రారంభోత్సవం వాయిదా వేయాలని అభ్యర్థిస్తున్నానన్నారు. హిందూ సాంప్రదాయ నమ్మకానికి వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం వ్యవహరించడం సరి కాదన్నారు. ఇంకా అనేక పనులు పెండింగ్‌లో ఉన్నందున విమానాశ్రయం పూర్తిగా సిద్ధంగా కూడా లేదని, అప్రోచ్ రోడ్డు, ఇతర సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని, ఈ సందర్భంగా పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రమం ఓ పెద్ద గందరగోళంగా వుందని, ఇలాంటి పరిస్థితిల్లో ప్రారంభోత్సవం చేయడం సరి కాదని ప్రజలు అభిప్రాయాన్ని కూడా ఆయన వ్యక్తపరిచారు. ఏపీలో పెట్టుబడులపై పార్లమెంటు సాక్షిగా చంద్రబాబు అవాస్తవాలు చెబుతున్నారని ఆరోపించారు. గత రెండు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ వచ్చిన పెట్టుబడులు కేవలం 6,962 కోట్లు మాత్రమేనని, కూటమి ప్రభుత్వం మాత్రం 25 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాయాని చెబుతున్నవి అన్నీ అబాద్దాలుగా తేలుతున్నాయన్నారు. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ పప్పూర్ నికుంజ్, పెద్దాడ రమణ, కే.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# వివేకః పరమం బలం

## వివేకమే మానవ జీవితానికి పరమశక్తి

**(సి.హెచ్.ప్రతాప్)**

**"వివేకః పరమం బలం" అనే సంస్కృత సూక్తికి "వివేకమే అత్యున్నతమైన బలం" అని అర్థం. శారీరక శక్తి మనిషిని యుద్ధరంగంలో గెలిపించవచ్చు, సంపద సౌకర్యాలను సమకూర్చవచ్చు, అధికారం ప్రభావాన్ని కల్పించవచ్చు, విద్య విజ్ఞానాన్ని ప్రసాదించవచ్చు. అయితే ఏది ధర్మం, ఏది అధర్మం, ఏది శాశ్వతం, ఏది క్షణికం, ఏది మేలు, ఏది కీడు అనే విషయాలను సమయోచితంగా గ్రహించి, సరైన నిర్ణయం తీసుకునే శక్తే వివేకం. ఈ వివేకమే వ్యక్తిత్వాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చే అంతరంగ బలం. అందుకే భారతీయ ఋషులు వివేకాన్ని మానవ జీవితానికి అత్యంత విలువైన సంపదగా అభివర్ణించారు.**



కఠోపనిషత్ ఈ సత్యాన్ని అత్యంత హృద్యంగా ప్రతిపాదిస్తుంది. "శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేతః" అనే మంత్రం ద్వారా ప్రతి మనిషి ముందూ రెండు మార్గాలు నిలుస్తాయని ఉపదేశిస్తుంది. ఒకటి తక్షణ సుఖాన్ని అందించే ప్రేయోమార్గం, మరొకటి శాశ్వత శ్రేయస్సును ప్రసాదించే శ్రేయోమార్గం. ఈ రెండింటిలో శాశ్వత మేలును గుర్తించి శ్రేయోమార్గాన్ని ఎంచుకునే సామర్థ్యమే వివేకం. కాబట్టి వివేకం అనేది తెలివితేటల ప్రదర్శన కాదు; విలువలను ఆధారంగా చేసుకొని జీవనాన్ని సన్మార్గంలో నడిపించే అంతరంగ ప్రకాశం.

భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ స్థితప్రజ్ఞుని లక్షణాలను వివరిస్తూ సమబుద్ధి, ఆత్మనిగ్రహం, ధర్మనిష్ఠలను జ్ఞానానికి పునాదులుగా పేర్కొన్నాడు. గీత రెండవ అధ్యాయం సారాంశమే వివేకబుద్ధి. అనుకూల పరిస్థితుల్లో అహంకారానికి లోనుకాకుండా, ప్రతికూల పరిస్థితుల్లో నిరాశకు గురికాకుండా, ధర్మబద్ధంగా నిర్ణయాలు తీసుకునే వ్యక్తియే నిజమైన బలవంతుడు. బాహ్య విజయాల కంటే అంతరంగ సమతుల్యత గొప్పదని గీత బోధిస్తుంది.

ఆది శంకరాచార్యుల వివేకచూడామణిలో లి"నిత్యానిత్య వస్తు వివేకం"లిను ఆధ్యాత్మిక జీవనానికి తొలి అర్హతగా పేర్కొన్నారు. శాశ్వతమైనది ఏది, నశ్వరమైనది ఏది అనే స్పష్టమైన అవగాహన కలిగినవాడు జీవితంలో మోహాలకు బానిస కాడు. వివేకం మనిషిని భ్రమల నుండి బయటకు తీసుకువచ్చి సత్యానికి చేరువ చేస్తుంది. అదే వ్యక్తిత్వ వికాసానికి, ఆత్మోన్నతికి మూలాధారమవుతుంది.

యోగవాశిష్ఠంలో మహర్షి వశిష్ఠుడు శ్రీరామునికి చేసిన ఉపదేశం కూడా ఇదే భావాన్ని ప్రతిధ్వనిస్తుంది. అజ్ఞానం మనిషిని బంధిస్తే, వివేకం విముక్తి వైపు నడిపిస్తుంది. కోపం, అసూయ, మోహం, అహంకారం వంటి అంతరంగ శత్రువులను జయించగల శక్తి ఆయుధాలలో లేదు; అది వివేకంలోనే ఉంది. అంతరంగాన్ని జయించినవాడే ప్రపంచాన్ని జయించగలడని ఈ గ్రంథం సందేశమిస్తుంది.

భారతీయ ఇతిహాసాలు కూడా వివేక మహిమను ఎన్నో సందర్భాల్లో చాటాయి. రామాయణంలో శ్రీరాముడు ప్రతి నిర్ణయాన్ని ధర్మం అనే ప్రమాణంతో పరిశీలించి ఆచరించాడు. మహాభారతంలో విదురుని నీతి, భీష్ముని ధర్మబోధలు రాజనీతి, సామాజిక నీతి, వ్యక్తిగత విలువలకు నిత్య మార్గదర్శకాలుగా నిలిచాయి. బలప్రయోగం సాధించలేని విజయాలను వివేకం సులభంగా సాధించగలదని ఈ ఇతిహాసాలు నిరూపించాయి.

నేటి సమాచార విస్ఫోటన యుగంలో జ్ఞానం సమృద్ధిగా లభిస్తున్నా, వివేకం కొరవడితే ఆ జ్ఞానమే వినాశనానికి కారణమవుతుంది. సామాజిక మాధ్యమాలు, సాంకేతిక పురోగతి, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాధనాల మధ్య వాస్తవాన్ని అసత్యం నుండి వేరు చేయడం, భావోద్వేగాల కంటే విలువలకు ప్రాధాన్యం ఇవ్వడం, తక్షణ లాభాల కంటే దీర్ఘకాల శ్రేయస్సును ఎంచుకోవడం ప్రతి వ్యక్తి బాధ్యత. ఈ నిర్ణయ సామర్థ్యాన్నే వివేకం అంటారు.


శారీరక బలం కాలంతో క్షీణిస్తుంది. సంపదలు వచ్చి పోతుంటాయి. అధికారాలు శాశ్వతం కావు. కానీ వివేకం మాత్రం జీవితాంతం మనిషిని రక్షించే అంతరంగ దీపస్తంభంలా నిలుస్తుంది. అది సరైన ఆలోచనను, ధర్మబద్ధమైన నిర్ణయాన్ని, నైతిక ధైర్యాన్ని, సమాజహిత దృష్టిని ప్రసాదిస్తుంది. అందుకే భారతీయ జ్ఞాన సంప్రదాయం "వివేకః పరమం బలం" అని శాశ్వత సత్యాన్ని ప్రకటించింది. నిజమైన బలం కండరాల్లో లేదు; ధర్మాన్ని గ్రహించే బుద్ధిలో, సత్యాన్ని అనుసరించే హృదయంలో, మానవత్వాన్ని నిలబెట్టే వివేకంలోనే ఉంది. ఇదే ఈ మహోన్నత సూక్తి మానవాళికి అందించే నిత్యనూతన జీవన సందేశం.

# డేటా భద్రతలో కొత్త మైలురాయి

## కాన్ఫిడెన్షియల్ కంప్యూటింగ్ విధానం

**(సి.హెచ్. ప్రతాప్)**

**ప్రస్తుత డిజిటల్ యుగంలో డేటా అత్యంత విలువైన ఆస్తిగా మారింది. ప్రభుత్వాలు, పెద్ద సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ఆర్థిక వ్యవస్థలు తమ దైనందిన కార్యకలాపాలను డేటాపైనే ఆధారపడి నిర్వహిస్తున్నాయి. అయితే సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ డేటా భద్రతకు సంబంధించిన సవాళ్లు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఇప్పటివరకు డేటాను రక్షించడానికి ప్రధానంగా రెండు విధానాలు ఉపయోగంలో ఉన్నాయి. ఒకటి డేటా నిల్వలో ఉన్నప్పుడు రక్షించడం; మరొకటి డేటా ఒక చోటు నుంచి మరో చోటుకు ప్రసారం అవుతున్నప్పుడు రహస్యీకరణ చేయడం. అయితే డేటా ప్రాసెసింగ్ జరుగుతున్న సమయంలో అది పూర్తిగా భద్రంగా లేకపోవడం ఒక పెద్ద లోపంగా ఉంది. ఈ సమస్యకు సమాధానంగా ఎదిగిన సాంకేతికతే కాన్ఫిడెన్షియల్ కంప్యూటింగ్.**



సాధారణంగా డేటాను విశ్లేషించే సమయంలో కంప్యూటర్ వ్యవస్థలు ఆ సమాచారాన్ని తాత్కాలికంగా రహస్యీకరణ లేకుండా ఉపయోగిస్తాయి. ఈ దశలో మెమరీలో ఉన్న డేటా హ్యాకర్లు లేదా అనధికార వ్యక్తులకు సులభంగా అందుబాటులోకి వచ్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా మేఘ గణన సేవలను వినియోగించే సంస్థలకు ఇది మరింత సున్నితమైన సమస్య. ఎందుకంటే వారి డేటా ఇతరుల మౌలిక సదుపాయాలపై ప్రాసెస్ అవుతుంది. ఇక్కడే కాన్ఫిడెన్షియల్ కంప్యూటింగ్ ప్రాధాన్యం పెరుగుతుంది. ఈ విధానంలో డేటా వినియోగంలో ఉన్నప్పటికీ నిరంతరం రహస్యీకరణలోనే ఉంటుంది. అంటే ప్రాసెసింగ్ జరుగుతున్న సమయంలో కూడా ఆ సమాచారాన్ని ఎవరూ అర్థం చేసుకోలేరు.

ఈ సాంకేతికతలో ప్రధాన భావన "భద్ర ప్రాసెసింగ్ ప్రాంతాలు". కంప్యూటర్ ప్రాసెసర్‌లో ప్రత్యేకంగా రూపొందించిన ఈ రక్షిత ప్రాంతాల్లోనే డేటా విశ్లేషణ జరుగుతుంది. ఈ ప్రాంతాన్ని ఆపరేటింగ్ సిస్టమ్ గానీ, ఇతర అనువర్తనాలు గానీ యాక్సెస్ చేయలేవు. అంతేకాకుండా క్లౌడ్ సర్వర్ నిర్వాహకులు కూడా ఆ డేటాను చూడలేరు. దీని వల్ల బాహ్య దాడుల నుంచే కాకుండా అంతర్గత ముప్పుల నుంచీ కూడా డేటాకు గట్టి రక్షణ లభిస్తుంది. అత్యంత గోప్యమైన సమాచారాన్ని సురక్షితంగా విశ్లేషించేందుకు ఇది ఒక బలమైన కవచంలా పనిచేస్తుంది.

కాన్ఫిడెన్షియల్ కంప్యూటింగ్ వల్ల సంస్థల మధ్య డేటా భాగస్వామ్యం సులభమవుతుంది. గోప్యత సమస్యల కారణంగా సంస్థలు తమ డేటాను పంచుకోవడంలో సంకోచిస్తాయి. కానీ ఈ సాంకేతికతతో డేటాను రహస్యీకరణలోనే ఉంచి ఉమ్మడిగా విశ్లేషించవచ్చు. దీనివల్ల వైద్య రంగంలో రోగుల గోప్యతను కాపాడుతూ కొత్త చికిత్సలపై పరిశోధనలు చేయవచ్చు. ఆర్థిక రంగంలో మోసాలను గుర్తించడంలో కూడా ఇది సహాయపడుతుంది. కృత్రిమ మేధస్సు అభివృద్ధిలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సాంకేతిక సంస్థలు ఈ విధానంపై దృష్టి సారిస్తున్నాయి. భవిష్యత్తులో డిజిటల్ వ్యవస్థలు విస్తరించేకొద్దీ డేటా భద్రత మరింత కీలకంగా మారుతుంది. అటువంటి సందర్భంలో కాన్ఫిడెన్షియల్ కంప్యూటింగ్ డేటాను నిల్వలో, ప్రసారంలో మాత్రమే కాకుండా వినియోగ దశలో కూడా రక్షించే సమగ్ర పరిష్కారాన్ని అందిస్తుంది. ఇది వినియోగదారుల విశ్వాసాన్ని పెంచడమే కాకుండా భవిష్యత్తు సాంకేతిక అభివృద్ధికి బలమైన పునాది వేస్తుంది. సైబర్ భద్రతా రంగంలో ఇది నిజంగా ఒక విప్లవాత్మక ముందడుగు.

# హజ్-2027 యాత్ర దరఖాస్తుకు రేపు ఆఖరి రోజు

## ఏపీ నుంచి దరఖాస్తు చేసుకున్న 2421మంది హాజీలు

## 388 మంది"షార్ట్" ఆప్షన్ ఎంపిక

## రూ.లక్ష ఆర్థిక సాయంతో "విజయవాడ" కు పెరిగిన సంఖ్య

## గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ విజ్ఞప్తి

**అమరావతి,జులై 22 ( జయ జయహే )**



పవిత్ర మక్కా యాత్ర హజ్ -2027 కు దరఖాస్తు చేసుకునేందుకు గడువు రేపటితో ముగియనున్నది. కేంద్ర హజ్ కమిటీ పెంచిన నాలుగు రోజుల గడువు శుక్రవారం(24 వ తేది )అర్ధరాత్రికి ముగుస్తుండడంతో హజ్ యాత్ర చేయాలనుకునే వారు గడువు ముగిసేలోగా దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ విజ్ఞప్తి చేశారు. హాజీలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి ఫరూక్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పవిత్ర మక్కా యాత్ర హజ్ -2027కు ఇప్పటివరకు (బుధవారం)2421 మంది యాత్రికులు ఆన్ లైన్ ద్వారా తమ తమ పూర్తి వివరాలతో కేంద్ర హజ్ కమిటీకి దరఖాస్తు చేసుకోవడం జరిగిందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన "షార్ట్ హజ్" ఆప్షన్ ద్వారా కుదించబడిన 20 రోజుల హజ్ యాత్ర కోసం 388 మంది హాజీలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యత ఇచ్చే ప్రయాణికులందరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న రూ. లక్ష ఆర్థిక సాయం కు విశేష స్పందన లభిస్తున్నదని అన్నారు. హజ్ -2026 యాత్రలో గన్నవరం విమానాశ్రయం నుంచివెళ్లి విజయవంతంగా హజ్ యాత్ర పూర్తి చేసి వచ్చిన 331 మంది ప్రయాణికుల కు రూ. 3.31 కోట్లు మొత్తాన్ని వారి అకౌంట్లకు జమ చేయడం జరిగిందన్నారు.ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తున్న క్రమంలో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యత ఇచ్చే వారి సంఖ్య కూడా పెరిగిందన్నారు. హజ్ -2027 యాత్ర కోసం 517 మంది యాత్రికులు విజయవాడకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడమే ఇందుకు నిదర్శనమని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. కేంద్ర హజ్ కమిటీ నిర్ణయం మేరకు పొడిగించబడిన హజ్ యాత్ర దరఖాస్తు గడువును మక్కా యాత్ర చేయాలనుకునే వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గడువులోగా పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని, విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యత ఇచ్చి కూటమి ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సాయం పొందాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ విజ్ఞప్తి చేశారు.

# అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం రద్దు చేయాలి: ఏ.ఐ.కే.ఎస్ డిమాండ్

**శ్రీకాళహస్తి రూరల్, జులై 22,జయ జయహే.**

రైతులకు నష్టం చేసే అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అంగెరి పుల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం శ్రీకాళహస్తి మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న రైతుల నడ్డి విరిచి పరాయి దేశానికి మేలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న దుర్మార్గమైన అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం కానీ జరిగితే మనదేశంలో వ్యవసాయ రంగాన్ని జీవనాధారంగా ఎంచుకొని తమ కుటుంబాలను పోషించుకుంటున్న 11 కోట్ల మంది రైతుల జీవితాలు నడిరోడ్డున పడతాయని, అలాగే 8 కోట్ల మంది పాడి రైతుల జీవితాలు నట్టేట మునిగిపోతాయని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పరాయి దేశానికి మేలు చేసే ఆలోచనను పక్కనపెట్టి ఎన్నో వ్యయ ప్రయాసలను ఎదుర్కొని పంటలు పండించే ప్రతి రైతుకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా గ్యారెంటీ చట్టాన్ని తీసుకురావాలని, మధ్యతరగతి రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం పదివేల రూపాయలు పెన్షన్ అందజేసే




విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి రైతుకు రుణమాఫీ కల్పించాలని, నాలుగు లేబర్ కోట్లను వెంటనే రద్దు చేయాలని ఆయన రైతు సంఘం తరఫున డిమాండ్ చేశారు. అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండల తాసిల్దార్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రంగయ్య, రాపూరు సుబ్రమణ్యం, మనోహర్, నాగరాజు, వెంకటాద్రి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



# జి.ఓ. నెం 396 సవరణ కోసం నిరసన

**శ్రీకాళహస్తి, జులై 22,జయ జయహే.**

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జి.ఓ. నెం396ను సవరించాలని కోరుతూ శ్రీకాళహస్తి సబ్ రిజిస్ట్రార్ కొర్యాలయం ఎదుట దస్తావేజు లేఖరులు చేపట్టిన నిరసన 3వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా రైటర్లు మాట్లాడుతూ నూతన జిఓ వలన వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న అనేక కుటుంబాలు వీధిన పడతాయని పేర్కొన్నారు. ప్రయివేటు సంస్థలకు దస్తావేజు లు తయారు చేసే పనిని అప్పగించడం వలన ప్రజల ఆస్తులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. సోమవారం నుంచి నెలాఖరు వరకు చేపట్టిన పెన్ డౌన్ కార్యక్రమంకు ప్రజలు తమ సహకారాన్ని అందించాలని రైటర్లు కోరారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే ఆదిమూలం

**కే.వి.బి.పురం, జూలై 22, జయ జయహే.**

కే.వి.బి.పురం మండలం ఆరే గ్రామపంచాయతీ పరిధిలోని జ్ఞానమ్మ కండ్రిగకు చెందిన ఓలూరు హరిబాబుకు తలకు శస్త్రచికిత్స కోసం మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 3,70,958 చెక్కును బుధవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్, ఎం.పీ. రాష్ట్ర మినిమమ్ వేజ్ అడ్వైజరీ బోర్డు, టి యూ టీయూసీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు జయరామ్ రెడ్డి, బి.ఎన్. కండ్రిగ మాజీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు సుబ్రహ్మణ్యం, డీవీసీ సభ్యుడు తలారి అయ్యప్ప, కే.వి.బి.పురం మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## యువతపై లాఠీఛార్జ్ సరికాదు

**డాక్టర్. ఎస్ .బత్తైయ్య నాయుడు.**

**శ్రీకాళహస్తి, జులై 22,జయ జయహే.**

కాక్రో జనతా పార్టీ నాయకుడు అభిజిత్ దీప్కే 32 రోజులుగా యువతతో కలిసి జంతర్ మంతర్ దగ్గర నీట్ యూజీ పేపర్ లీక్ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని నిరసన చేస్తున్న యువత పై లాఠీ ఛార్జ్ చేయడం సరికాదని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్. ఎస్ .బత్తైయ్య నాయుడు అన్నారు. లాఠీ ఛార్జ్ ని ఖండిస్తూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ , కాంగ్రెస్ పార్టీ దేశ అధ్యక్షులు కార్గే లు ధర్నా చేశారని వారిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. పీఎం మోడీ హయాంలో అరాచకాలు ఎక్కువయ్యాయని యువతకు కోట్లల్లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పి చెయ్యకుండా నీరుగార్చారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులుజనార్దన్ రెడ్డి, వెంకట ముని, నాగూరయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాని నివాసం ముట్టడికి నిరసనగా బిజెపి ధర్నా

**అనకాపల్లి జయ జయహే**

ప్రధాని నరేంద్ర మోడీ నివాసాన్ని ముట్టడించే ప్రయత్నాన్ని నిరసిస్తూ బిజెపి నాయకులు అనకాపల్లిలో బుధవారం ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ విదేశీ శక్తులతో చేయి కలిపి దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో పార్లమెంట్ ప్రధాని నివాసాన్ని ముట్టడించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారన్నారు శాంతియుత నిరసన పేరట నిర్వహించిన కార్యక్రమంలో రాళ్లు ఎలా వచ్చాయో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు ధర్నా సందర్భంగా బిజెపి నాయకులు మోదీ జిందాబాద్ రాహుల్ గాంధీ డౌన్ డౌన్ నినాదాలు చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు ఉపాధ్యక్షుడు ప్రసాద్ కార్య దర్శి భానుమతి రాష్ట్ర ఓబిసి నాయకుడు కర్రి రామకృష్ణ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీరంగం రమేష్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ భాస్కరరావు తదితరులు ధర్నాలో పాల్గొన్నారు

## విద్యార్థులపై ఉక్కుపాదం..!

**రాజమహేంద్రవరం: జయ జయ : జూలై 22 :**



ఢిల్లీ కేంద్రంగా విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడి దమనకాండ భారతదేశ చరిత్రలోనే ఒక చెరగని మచ్చగా మిగిలిపోతుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నాయకులు మేడా శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విద్యా మాఫియాకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న భావి పౌరులైన విద్యార్థులను పశువుల మాదిరిగా కొట్టడం అత్యంత సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. ఒకవైపు విద్యార్థుల శరీరాలపై ఇనుప బూట్లతో ఉక్కుపాదం మోపుతూనే, మరోవైపు "నీట్ పేపర్ లీకేజీ ఘోర పాపం" అంటూ ప్రధాని నరేంద్ర మోడీ వెన్నపూత ప్రకటనలు చేయడం విద్యార్థుల భవిష్యత్తును హేళన చేయడమేనని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తును విద్యా మాఫియాకు అమ్మేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరడం ఏ చట్టం ప్రకారం నేరమవుతుందో ప్రధాని మోడీ చెప్పాలని డిమాండ్ చేశారు. భారతదేశం నిజంగా ప్రజాస్వామ్య దేశమేనా, లేక ఆ భ్రమలో మాత్రమే బ్రతుకుతున్నామా అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ అమానుష విధానాలు, మహాపాపాలు మోదీ సర్కార్‌ను కచ్చితంగా వెంటాడుతాయని శ్రీనివాస్ హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుకు పూర్తి న్యాయం జరగాలని, యువత అంతా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులను గాయపరిచిన పాలకులకు యావత్ భారతీయ పౌరులు తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.




## లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ ర్యాలీ

**సూళ్లూరుపేట, జులై 22,జయ జయహే**

లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అక్రమ అరెస్ట్ ను నిరసిస్తూ డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో భారీ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ గా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రాజ్యాంగం బ్రతకాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్బంగా బాలగురవం బాబు మాట్లాడుతూ నేడు భారతదేశం లో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుందని లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అయిందన్నారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ వైఫల్యం అని దీనికి సంబంధిత కేంద్ర విద్యాశాఖ మంత్రి బాధ్యత తీసుకుని వెంటనే రాజీనామా చేయాలని కోరారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో నియంత పాలన కొనసాగుతుందని లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శాంతియుతంగా నిరసన తెలియజేస్తుండగా అధికారజులుం తో వారిని రక్త గాయాలు అయ్యేటట్లు హింసించి అరెస్ట్ చేయడంఅప్రజాస్వామికమన్నారు. గాంధీల కుటుంబం భారతదేశం కోసం ప్రాణాలను అర్పించిందని, ప్రశ్నించే గొంతుకులను అణిచివేయడం సరికాదన్నారు. పేపర్ లీకులకు కారణమైన వారిని తక్షణమే శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, మండల అధ్యక్షులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.




## జాతీయ పతాక దినోత్సవాన్ని నిర్వహించిన స్కౌట్స్ అండ్ గైడ్స్

**శ్రీకాళహస్తి, జులై 22,జయజయహే.**

శ్రీకాళహస్తి భాస్కరపేట మున్సిపల్ హైస్కూల్ లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో జాతీయ పతాక దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్ప, స్కౌట్ మాస్టర్ షేక్ అజారుద్దీన్ విద్యార్థులకు జాతీయ పతాక ప్రాముఖ్యతను వివరించారు. త్రివర్ణ పతాకం కేవలం ఒక జెండా మాత్రమే కాదని, అది భారతీయుల ఐక్యత, స్వేచ్ఛ, త్యాగం, గౌరవానికి ప్రతీకని తెలిపారు. జాతీయ పతాకాన్ని ఎల్లప్పుడూ గౌరవిస్తూ దేశ గౌరవాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గైడ్ క్యాప్టెన్ నాగజ్యోతి, నాగమ్మని ఉపాధ్యాయురాలు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గోమాతల సంరక్షణ ఎక్కడ?

## రోడ్లపై తిరుగుతూ ప్రమాదాల బారిన పడుతున్న ఆవులు

**అనంతపురం, జూలై 22( జయ జయహే )**

హిందూ సంప్రదాయంలో గోమాతను దైవస్వరూపంగా భావిస్తారు. అయితే అనంతపురం నగరంలో మాత్రం గోమాతల పరిస్థితి దయనీయంగా మారింది. నగరంలోని ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు, జాతీయ రహదారులపై గోవులు గుంపులుగా సంచరిస్తూ కనిపిస్తున్నాయి. ఆహారం కోసం చెత్తకుప్పలను ఆశ్రయిస్తున్న గోవులు ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థ పదార్థాలు తింటూ తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నాయి. మరోవైపు రహదారులపై తిరుగుతుండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దాదాపు ప్రతి వారం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ గోవులు వాహనాలు ఢీకొని మృతి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిసార్లు వాహనదారులు కూడా గాయపడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గోవులను పెంచుతున్న కొందరు యజమానులు వాటిని పగలు, రాత్రి తేడా లేకుండా రోడ్లపై వదిలేయడం వల్ల ఈ పరిస్థితి నెలకొంటోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గోవులను సక్రమంగా సంరక్షించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వాటి ప్రాణాలతో పాటు ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం,



మున్సిపల్ అధికారులు, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా ప్రత్యేక చర్యలు చేపట్టి రోడ్లపై సంచరిస్తున్న గోవులను గోశాలలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే గోవులను నిర్లక్ష్యంగా రోడ్లపై వదిలే యజమానులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.



## శ్రీనివాసుని దర్శించుకున్న పీఠాధిపతులు

**తిరుమల, జూలై 22, జయ జయహే**

తిరుమల శ్రీవారిని శ్రీ వ్యాసాశ్రమం పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి, ఏర్పేడు శ్రీ వ్యాసాశ్రమం పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందగిరి స్వాములవారు బుధవారం దర్శించుకున్నారు. వారు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# జగన్ సూపర్ యాప్ 2.0 ఆవిష్కరించిన వైయస్సార్ పార్టీ నాయకులు

**జయ జయహే**

స్థానిక రింగ్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో గల వైఎస్ఆర్ పార్టీ కార్యాలయంలో జగన్ సూపర్ యాప్ 2.0 పోస్టర్ ఆవిష్కరించిన వైయస్సార్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా వైయస్సార్ పార్టీ అధ్యక్షులు మలసాల భరత్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సూపర్ 2.0 సూపర్ సోషల్ మీడియా యాప్ను ఆవిష్కరించారని ఈ యాప్ ద్వారా రాష్ట్రంలో జరుగుతున్న వైయస్సార్ పార్టీ కార్యక్రమాలను ప్రచారం జరుగుతాయని అలాగే వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు పై దాడులు సంబంధించినవి కూడా ఈ యాప్ లోడ్ చేయవచ్చని కార్యకర్తలు కష్టాలు కూడా చెప్పుకోవచ్చు అని అలాగే రాష్ట్రంలోని వైయస్సార్ పార్టీ నాయకులు పై దాడులు అక్రమ కేసులు ఎవరు పెడుతున్నది ఎవరు చేస్తున్నారు కూడా దీనికి ఒక ప్రత్యేక డైరీ అని ఒక ప్రత్యేక యాప్ ని పెట్టడం జరిగిందని దీంట్లో అధికారుల పేర్లు నాయకులు పేర్లు కూడా పెట్టవచ్చని మన ప్రభుత్వం అధికారంలో వచ్చాక వీటిని పరిశీలించడం జరుగుతుందని వారిపై చర్యలు ఆనాడు ఉంటాయని పేర్కొన్నారు కూటమి ప్రభుత్వం వచ్చాక వైయస్సార్ పార్టీ నాయకులపై కార్యకర్తలపై అక్రమ కేసులు అలాగే మన పార్టీ పెట్టే పోస్టులు మరియు సోషల్ మీడియాని ఈ ప్రభుత్వం అడ్డుకుంటున్నదని పోస్టులను తొలగిస్తున్నదని మాజీ ఎంపీ బీసెట్టి సత్యవతి ఆరోపించడం జరిగింది కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తున్న అని ప్రచారం చేసుకుంటూ ఎక్కడ ప్రజలకి ఈ సంక్షేమ పథకాలు అందటం లేదని ప్రజలే చెబుతున్నారని ముఖ్యంగా పార్టీ నాయకులే బహిరంగ చెప్తున్నారు సూపర్ సిక్స్ పథకాలు అని చెప్తున్నారు కానీ అవి ఎక్కడ లేవని మన ప్రభుత్వంలో అందరిని సమానంగా చూసామని అందరికీ సంక్షేమ పథకాలు ఇవ్వడం జరిగిందని సోషల్ మీడియాని కూడా ఈ ప్రభుత్వం తీసుకున్న వ్యతిరేక చర్యలు ఆనాటి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అటువంటి చర్యలు చేయలేదని ఆమె పేర్కొన్నారు. ఈ సూపర్ యాప్ ద్వారా పార్టీ కార్యకర్తలకు నాయకులకు ఎంతో ఉపయోగపడుతుందని అలాగే ప్రజల కష్టాలు కూడా నేరుగా జగన్మోహన్ రెడ్డికి ఈ సూపర్ యాప్ ద్వారా తెలియజేసుకోవచ్చని ఆమె అన్నారు వైయస్సార్ పార్టీ బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ వైయస్సార్ పెట్టిన సంక్షేమ పథకాలన్నీ ఆనాడు ప్రజలకు అందరికీ అందాయని ఈ కూటమి ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క పథకం ప్రజల వద్దకు సక్రమంగా చేరటం లేదని సంక్షేమ పథకాలు పేరు చెప్పి రాష్ట్ర అప్పులు పెంచుకుంటూ పోతున్నారని ఆనాడు జగన్మోహన్ రెడ్డిని విమర్శించిన నాయకులు మరి వీరు చేస్తున్నది ఏమిటో అని వారి ప్రశ్నించారు స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ గత రెండు రోజుల క్రితం ఉగ్గిన పాలెం గ్రామంలో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడిన మాటలు జగన్మోహన్ రెడ్డి పై విమర్శలు చేస్తూ గొడ్డలి పార్టీ అని విమర్శ చేయడం జరిగిందని అది ఆయన హుందాతనానికి తగునా అని వారు ప్రశ్నించడం జరిగింది జగన్మోహన్ రెడ్డి తండ్రి కీర్తిశేషులు వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో గౌరవం ఇచ్చారని ఆయన దయతో ఎన్నో మంత్రి పదవులు అలంకరించారని అటువంటి మంచి చేసిన నాయకుడు కొడుకు జగన్మోహన్ రెడ్డిని విమర్శించడం మీకు భావ్యమా అని వారు ప్రశ్నించడం జరిగింది ఇదంతా చంద్రబాబు నాయుడు కనుసనలో పడడానికి ఇదంతా మంత్రి పదవి కోసం ఆశిస్తూ చేస్తున్న పని వారు విమర్శించారు ఇప్పటికైనా మీ మంచితనాన్ని, హుందాతనాన్ని,గౌరవాన్ని నిలబెట్టుకోవాలని వారు సూచించారు. పంచదారల పుణ్యక్షేత్రం వద్ద జరుగుతున్న క్వారీ తవ్వకాలు నిలుపు చేయాలని చలో పంచదారల పిలుపుకి రాష్ట్రంలో మంచి స్పందన వచ్చిందని అటు అనకాపల్లి జిల్లా ఇటు విశాఖపట్నం నుంచి పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున నిరసన కార్యక్రమానికి పంచదార పుణ్యక్షేత్రానికి తరలి రావడం జరిగి మొత్తానికి ప్రభుత్వం తవ్వకాలని నిలుపుదలకు తక్షణ చర్యలు తీసుకుందని వారు పేర్కొన్నారు ఇటువంటి అక్రమాలు ఇంకా ఎన్నో జరుగుతున్నాయని వారి ఆరోపించారు కార్యక్రమానికి వైయస్సార్ మనసాల బుల్లి బాబు, మనసాల కిషోర్ జానకిరామరాజు, జాజుల రమేష్, బొడ్డేడ శివ, నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళి






# అనాథాశ్రమంలో చిన్నారులకు బూట్ల పంపిణీ

## స్నేహాంజలి ఫర్ ప్యూర్ ఆర్గనైజేషన్ సేవా కార్యక్రమం

**భీమిలి (జయ జయహే )**

స్నేహాంజలి ఫర్ ప్యూర్ ఆర్గనైజేషన్. సంస్థ నిర్వహించిన 290వ సేవా కార్యక్రమంలో భాగంగా భీమిలి సమీపంలోని దొరతోటలో ఉన్న లిటిల్ హగ్స్ అనాథాశ్రమంలోని 25 మంది చిన్నారులకు తెలుపు, నలుపు రంగుల బూట్లను ఒకొక్కరికి రెండు జతల బూట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు తమకు అవసరమైన వస్తువులు అందడంతో చిన్నారులు చిరునవ్వులు చిందిస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రూత్ న్యూస్ ఛానల్ ఎండీ కిట్టు మాట్లాడుతూ, తాము విజ్ఞప్తి చేసిన వెంటనే స్పందించిన స్నేహాంజలి ఫర్ ప్యూర్ ఆర్గనైజేషన్ సేవాభావం నిజంగా అభినందనీయమని అన్నారు. గత సంక్రాంతి సందర్భంగా చిన్నారులకు నూతన దుస్తులు అందించిన సంస్థ, ఇప్పుడు ప్రతి విద్యార్థికి రెండు జతల బూట్లను అందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని, సంస్థ చేస్తున్న సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తమ కుమారుడి పుట్టినరోజును అనాథ చిన్నారులతో పంచుకోవాలనే గొప్ప ఆలోచనతో 25 మంది పిల్లలకు బూట్ల పంపిణీకి కావాల్సిన మొత్తం ఆర్థిక సహాయం అందించిన స్నేహంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యులు మళ్ల మహాలక్ష్మి నాయుడును ని ప్రత్యేకంగా అభినందిస్తూ, ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు



# బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తాం

## ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్ నాయుడు

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ జులై 23**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం రాజేంద్రపాలెంలో బాధితులు చేపట్టిన నిరాహార దీక్ష బుధవారానికి 6వ రోజుకు చేరుకుంది. రోజులు గడుస్తున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్ నాయుడు, బాధితులకు నేరుగా మద్దతు ప్రకటించారు.బాధితులకు అండగా నేనున్నాను. అంటూ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి .బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చూసే బాధ్యత నాది. అన్ని కిల్లు వెంకట రమేష్ నాయుడు పత్రిక ముకంగా ఈ విషయాన్ని తెలిపారు అయితే ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తలు సీనియర్ నేతలు పాల్గొని మద్దతు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నేతలు గొలిసింగి సత్యనారాయణ. మాజీ ఎంపీపీ కొర్రు రామమూర్తి.అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి.పొటుకూరి సన్యాసిరావు.కొర్రు పుల్లయ్య గ్రామ కమిటీ అధ్యక్షుడు.పొటుకూరి ప్రసాద్.ఎలమంచిలి వరహాల బాబు. నవరంగి వెంకటరావు.బుధరాళ్ల టీడీపీ సీనియర్ నాయకుడు మొట్టడం శ్రీను.



# డిఎస్పిగా బాధ్యతలు తీసుకున్న వెంకటేశ్వర్లు

## శుభాకాంక్షలు తెలిపిన సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది

**జంగారెడ్డిగూడెం -జయ జయహే**

స్థానిక డి ఎస్ పి గా బి హెచ్ వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు తీసుకున్నారు.ఆయన విజయవాడ కమీషనరేట్ లోని అజిత్ సింగ్ నగర్ క్రైం సి ఐ గా పని చేసారు.ప్రమోషన్ పై డి ఎస్ పి గా ఇక్కడ కు వచ్చారు . బాధ్యతలు స్వీకరణ అనంతరం తనను కలిసిన మీడియా ప్రతి నిధులతో డి ఎస్ పి మాట్లాడుతూ .తన స్వంత ఊరు జగ్గయ్యపేట అని ముప్పై ఏళ్ళు పోలీస్ డిపార్ట్మెంట్ లో అనుభవం ఉందని చెప్పారు.ఇక్కడి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం వి సుభాష్ ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పుష్ప గుచ్ఛమిచ్చి స్వాగతం పలికారు.సబ్ డివిజన్ లోని పోలీస్ అధికారులు సిబ్బంది మర్యాద పూర్వకంగా కలి సి స్వాగతం చెప్పారు. ఈ సందర్భంగా డి ఎస్ పి మాట్లాడు తన సర్వీస్ ఎస్ఐ నుండి తూర్పు గోదావరి జిల్లా లోనేనని పేర్కొన్నారు జిల్లా ఎస్ పి ఆదేశాలమేరకు శాంతి భద్ర తల పరిస్థితి అదుపులో ఉంచేందుకు క్రైం రేటు తగ్గించేందుకు కృషి చేస్తానన్నారు. ట్రాఫిక్ పైప్రత్యేక దృష్టిపెడ్తానని డి ఎస్ పి పేర్కొన్నారు.నెల రోజులు పాటు ఇక్కడి పరిస్థితి పరిశీలించి అవసరం అయిన చర్యలు చెపడతానని తెలిపారు.



# విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయునికి ఎప్పటికీ పదవి విరమణలు ఉండదు

## బ్లాక్ బోర్డ్ మాస్టర్ కృష్ణ మోహన్ ను సత్కరించిన మార్నింగ్ కాఫీ క్లబ్

**భీమవరం ; (జయ జయహే )**

పదవులకు రిటైర్మెంట్ ఉంటుందేమో గానీ విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయునికి ఎప్పటికీ పదవి విరమణలు ఉండవని, ఎప్పటికీ విద్యార్థికి గురువే అని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పిఆర్ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు, కోట్ల నాని,చవ్వా శ్రీనివాస సుబ్బారావు అన్నారు. 28 ఏళ్లుగా వివిధ పాఠశాలలో పని చేసి పదవి విరమణ చేసిన బ్లాక్ బోర్డ్ మాస్టర్ కాళీపట్నం వెంకట సత్య కృష్ణ మోహన్ ను మార్నింగ్ కాఫీ క్లబ్ అధ్వర్యంలో బుధవారం సత్కరించారు. గాదె నాగేశ్వరావు, మానేపల్లి రవి చిన్నారావు, కనగర్ల రామకృష్ణ మాట్లాడుతూ గత 28 ఏళ్లుగా కృష్ణ మోహన్ కాళ్లలోని మాలవాని తిప్ప, బొండాడ లంక, బొండాడ చిన పేట, కోమటి గుంట, శృంగవృక్షం లోని జెడ్పీ హైస్కూల్లో మ్యాథ్స్ ఉపాధ్యాయునిగా అందించిన సేవలు ఎనలేనివని అన్నారు.జూలూరి గోపిరాజు, కనగర్ల కిషోర్ మాట్లాడుతూ పదవులకు విరమణ ఉండచ్చు ఏమోగాని ఆయన అందించే సేవలకు విరమణ లేదన్నారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో మానేపల్లి వెంకన్నబాబు, కంచర్ల భాస్కరరావు గుప్త, బొండాడ మనీష్, బాయ్స్ శ్రీనివాస్, గుండు సుమూర్తి, సంకా బాబు, చవ్వా భామ కృష్ణమూర్తి, గుండు సుధీర్, వాకర్స్, మాస్టర్ మిత్రులు పాలుగొన్నారు



# అన్న ప్రసాదానికి రూ.10 వేల వాసుపల్లి విరాళం..!

**విశాఖపట్నం, జూలై 22, జయ జయహే :**

దక్షిణ నియోజకవర్గం 31వ వార్డులో కొలువుదీరిన శ్రీ మరిడిమాంబ అమ్మవారి ఆలయ జాతర సందర్భంగా నిర్వహించనున్న అన్నదాన ప్రసాదానికి దక్షిణ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ రూ. 10 వేల విరాళం అందజేశారు. కనకల వీధి కి చెందిన ఈ ఆలయ కమిటీ సభ్యులకు 31 వైసీపీ అధ్యక్షుడు బాపు ఆనంద్ సమక్షంలో బుధవారం ఆసీలమెట్ల కార్యాలయంలో పదివేల నగదును వారికి అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న లేకున్నా సేవా కార్యక్రమాలు చేసినందుకు తాను ఎప్పుడూ ముందుంటానన్నారు. ప్రతి ఏడాది నిర్వహించే ఈ మరిడి మాంబ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా జరగాలని వాసుపల్లి గణేష్ కుమార్ ఆకాంక్షించారు. అన్నదాన కార్యక్రమంలో ఎంతోమంది అమ్మవారి ప్రసాదంతో కడుపు నింపుకునేవారు వందలాదిమంది ఉంటారన్నారు. అటువంటి పేదలకు కూడా న్యాయం చేసే జగన్మోహన్ రెడ్డి మళ్ళీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలతోపాటు ఆంధ్ర రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. అమ్మవారి కరుణాకటాక్షం జగనన్న కుటుంబం పై చల్లగా ఉండాలని వాసుపల్లి గణేష్ కుమార్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పల్ల శ్రీను, పిలక మోహన్ ( డిస్ట్రిక్ట్ స్టూడెంట్ వింగ్ జనరల్ సెక్రటరీ ), దినేష్ ( వార్డ్ స్టూడెంట్ వింగ్ ప్రెసిడెంట్స్ ),కమిటీ సభ్యులు అప్పారావు, నాయుడు, మహేష్

# శర్వాణి విద్యాలయలో జాతీయ పతాక దినోత్సవం

## 100 అడుగుల భారీ జాతీయ పతాకంతో ర్యాలీ

**అరసవల్లి కూడలి - (జయ జయహే )**

నగరంలోని అరసవిల్లి రోడ్డులో గల శర్వాణి విద్యాలయ వ్యవస్థాపకులు అంధవరపు.సూరిబాబు ఆధ్వర్యంలో బుధవారం జాతీయ పతాక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శర్వాణి పాఠశాల విద్యార్థులు పి.యస్.ఎస్.ఎం మిల్లు జంక్షన్ వరకు వంద అడుగుల భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. భారతమాతకీ జై, వందేమాతరం, జోహార్ పింగళి వెంకయ్య నినాదాలతో హోరెత్తించారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల కృషిఫలితంగా సాధించిన స్వేచ్ఛకు, సగౌరవ ప్రతీక మన జాతీయ పతాకమన్నారు. తెలుగుజాతి ముద్దుబిడ్డ స్వర్గీయ పింగళి వెంకయ్య అద్భుత ఆలోచనగా జనించిన మన మువ్వన్నెల జెండా ప్రతి భారతీయుడి గుండెచప్పుడుగా నేటికీ సగర్వంగా విశ్వవిఖ్యాతమై నిలుస్తుందన్నారు. 1906 లో స్వర్గీయ భికాజీ కామ స్వయంగా రూపొందించిన పతాకం నుండి స్వర్గీయ పింగళి వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకం వరకు పలు మార్పులు చేర్పులు జరిగినప్పటికీ భారత రాజ్యాంగ మౌళిక సిద్ధాంతాల చిహ్నంగా తిరంగా నిలిచిందన్నారు. త్యాగం, శాంతి, సస్యశ్యామల దేశం 24 ధర్మబద్ధ నియమాలతో నడుస్తుందనే రాజ్యాంగ స్ఫూర్తికి మన జాతీయ జెండా ప్రతీకగా నిలిచిందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్. కె.రేఖ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల త్యాగనిరతిని స్ఫూర్తి జ్వాలగా నవతరం స్వీకరించాలని, నైతికతను పుణికిపుచ్చుకుని, అధర్మాన్ని, అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, విశ్వవేదికపై భరతజాతి కీర్తి చిహ్నంగా మన తిరంగాను ఎగురవేయాలని, పతాక స్మృతి(ఫ్లాగ్ కోడ్) ను తు.చ తప్పకుండా పాటించి, పతాక గౌరవాన్ని చాటిచెప్పాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం జాతీయ పతాక గౌరవాన్ని కాపాడతామని విద్యార్థులచేత డా.రేఖ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కడలి దేవశ్రీ, పల్లి వెంకటరమణ, సుకీర్తి పాణిగ్రహి లు త్రివర్ణ పతాక విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# మ్యుటేషన్ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

## అర్జీలపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి పరిష్కరించాలి.. జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

**అనకాపల్లి, జూలై 22, జయ జయహే**

భూముల మ్యుటేషన్ దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎసఎలఏలో ఉండకుండా నిర్ణీత గడువులోనే పరిష్కరించాలని డి.ఆర్వో, ఆర్డీఓలు, తహసీల్దార్లను జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం కలక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, సర్వే మరియు భూమి రికార్డులు, పౌర సరఫరాల శాఖల పై మండల, డివిజన్ ల వారిగా మరియు గ్రామ వార్డు సచివాలయల సర్వీస్ లు, రెవెన్యూ క్లినిక్, మ్యుటేషన్లు, పి జి ఆర్ ఎస్ లలో వచ్చిన అర్జీల పై జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రతి రోజు క్షేత్ర స్థాయిలో మానిటరింగ్ చేసి, రెవెన్యూ సేవలలో ఆలస్యం లేకుండా ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూ, ఆక్రమణలను నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో వివాదరహిత భూ రికార్డులు, బాధ్యతాయుత రెవెన్యూ పరిపాలన కోసం అధికారులు మరింత చురుకుగా పనిచేయాలన్నారు. ఆన్లైన్ సేవలు, భూ వ్యాపింగ్, రికార్డులు అప్డేషన్, మ్యుటేషన్ దరఖాస్తులు వంటి సమస్యలపై కార్యాచరణ ప్రణాళిక తయారుచేసుకొని పరిష్కరించాలన్నారు. లోపాలు ఉన్న చోట వెంటనే సరిదిద్దాలని, నిర్ణీత సమయంలో నివేదికలు సమర్పించాలన్నారు. పిజిఆరఎస్, రెవిన్యూ క్లినిక్ లలో ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే విచారణ చేయాలన్నారు. సమావేశంలో డి.ఆర్వో వై. సత్యనారాయణ రావు, ప్రత్యేక డిప్యుటీ కలెక్టర్లు కె.మనోరమ, అనిత, సుబ్బలక్ష్మి , జిల్లా పౌర సరఫరాల అధికారి మూర్తి, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓలు షేక్ అయిషా, వి వి రమణ, ఎడి సర్వే గోపాలరాజా, అన్ని మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, కలక్టరేట్ మేజిస్ట్రియల్, కో ఆర్డినేషన్, భూ వ్యవహారాల పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.



# పోరాటయోధుడు ముద్రగడ


## ముద్రగడ కుమారులను పరామర్శించిన నరసాపురం వైసీపీ నేతలు

**కిర్లంపూడి, జూలై 22, జయ జయహే**

కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నరసాపురం వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బుధవారం ముద్రగడ పద్మనాభం స్వాగ్రామానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వారి సమాధి వద్ద నివాళులు అర్పించారు. అనంతరం వారి కుమారులు ముద్రగడ బాలు, గిరిబాబులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం సొంత ప్రయోజనాల కన్నా కాపు జాతి కోసం వారి జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తని, ఆయన మహా పోరాట యోధుడని, ఆయన పోరాటంతోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో కాపు జాతికి గుర్తింపు వచ్చిందనే విషయాన్ని ప్రతి ఒక్కరు కూడా మర్చిపోకూడదన్నారు, అలాగే కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి మనో ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుని ప్రార్థించారు. కిర్లంపూడి వచ్చిన వారిలో నరసాపురం నియోజకవర్గ ప్రముఖులువైయస్సార్ కాంగ్రెసు పార్టీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న,వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పప్పుల రామారావు, నరసాపురం నియోజకవర్గం శెట్టిబలిజ సంఘం ప్రముఖులు వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పాల రాంబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, నియోజకవర్గ బూత్ ల కన్వీనర్ కావలి నాని, నరసాపురం మండల ఆ పార్టీ అధ్యక్షులు ఉంగరాల రమేష్ నాయుడు, తన్నీడి గిరి, పోతుల రమేష్, కొత్తపల్లి బాబి, పులపర్తి ప్రతాప్, కుక్కల రాజు, గుడాల సత్తిబాబు, కంకటాల పెద్దిరాజు, అడ్డాల నరసింహారావు, లక్కు నారాయణరావు, కుడుపూడి శ్రీనివాస్, రంగిశెట్టి ఏసు, సిరిగినీడి వెంకటేశ్వరరావు ఇవన రమేష్, యడ్లపల్లి హ ర్ష, గన్నబత్తుల సందీప్, కున పురెడ్డి నారాయణరావు, పిప్పళ్ళ పాపారావు, ముత్యాల వెంకటరావు, కానుకోనల సాయి కోటిపల్లి గోపాల కృష్ణబళ్ళ మణికంఠ, తదితర రాష్ట్ర జిల్లా మండల నాయకులు పాల్గొన్నారు



# ధర్మేంద్ర రాజీనామా చేస్తేనే నీట్‌పై చర్చ



## రాజ్యసభలో తేల్చి చెప్పిన కాంగ్రెస్ నేత ఖర్గే

**జయ జయహే :**

నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలంటే.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే తేల్చి చెప్పారు. బుధవారం రాజ్యసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. 'నీట్ అంశంపై నిష్పక్షపాతంగా చర్చ జరగాలంటే.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా చేసేంతవరకు ఎలాంటి చర్చా ఉండదు' అని అన్నారు. దీనిపై లీడర్ ఆఫ్ ది హౌస్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందిస్తూ.. 'ప్రభుత్వం చర్చకు వెనకడుగు వేయడం లేదు. అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఇప్పుడే చాలా స్పష్టంగా చెప్పారు. నీట్ పేపర్ లీకేజీకి సంబంధించిన అన్ని విషయాలపై కూడా చర్చించడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మాది పారదర్శకమైన ప్రభుత్వం' అని అన్నారు. ÷ఖేంద్ర ప్రభుత్వం తరఫున పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కానీ, ప్రతిపక్షాలు నిరసనలతో సభను అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. 'మీరు సభ జరగకుండా అడ్డుకోవాలన్న ఆలోచనతో ఉంటే.. అది కచ్చితంగా మంచి పద్ధతి కాదు' అని అన్నారు.

# రేషన్ డీలర్స్ అవగాహన సదస్సు

## సమస్యలు పరిస్కరిస్తాం, అంఢ్లడగా నిలుస్తాం.

## జిల్లా పౌర సరఫరా అధికారి సూర్యప్రకాష్

**శ్రీకాకుళం (జయ జయహే)**

జిల్లాలోని రేషన్ డీలర్స్ సమస్యలు పరిస్కరిస్తామని, అండగా నిలుస్తామని, జిల్లా పౌర సరఫరా అధికారి సూర్యప్రకాష్ అన్నారు. శ్రీకాకుళం స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో, శ్రీకాకుళం డివిజన్ రేషన్ డీలర్స్ అవగాహన సదస్సును నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, జిల్లా పౌర సరఫరా అధికారి సూర్యప్రకాష్ పాల్గొని మాట్లాడుతూ రేషన్ డీలర్లుకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, సమస్యలను సంబంధిత అధికారుల వరకు, తీసుకువెళ్తామన్నారు. రేషన్ డీలర్ల సంఘ నాయకులతో నిర్వహించిన సమావేశంలో అన్ని మండలాలకు చెందిన డీలర్స్ ప్రతినిధులు పాల్గొని, తమ సమస్యలను విన్నవించారని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మీ కృషి అభినందనీయమన్నారు. ఐ.వి.ఆర్.ఎస్ సర్వే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని, సర్వేతో రేషన్ డీలర్లుకు ఎటువంటి అసౌకర్యాలు కలగవని, సరుకులు తీసుకున్నారా అనే అంశంపై, కార్డు దారులు ఇచ్చే సమాధానంతో డీలర్లు డీలాపడవద్దని, కొన్ని సమయాలలో, కొంత మంది ఆకతాయిలు చేస్తున్న ప్రక్రియలో ఇదొక భాగమని, నిత్యావసర సరుకులు తీసుకున్నప్పటికీ కొంతమంది తీసుకోలేదని, ఐవిఆర్ఎస్ సర్వేలో నమోదు చేయడం జరుగుతుండటం గమనిస్తున్నామన్నారు. మీకు జరుగుతున్న ప్రతీ సమస్యను జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేల వరకు చేరుస్తామని, వీలైనంత వరకు తమ తమ సమస్యలను సత్వరమే పరిస్కారమయ్యే విధంగా చొరవ తీసుకుంటామన్నారు. అనంతరం ప్రతీ మండలాలలో సమస్యలను, ఏకాగ్రతతో విని, అందుకు తగ్గ సూచనా, సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమా.గౌరీ, డిఎమ్ శ్రీనివాస రావు, జిల్లా అధ్యక్షులు వడగ.భాస్కర రావు, ప్రధానకార్యదర్శి సాన.సణ్ముఖరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రవి కుమార్, నరసన్నపేట ప్రెసిడెంట్ మురళి.మోహన్, సీఎస్ డిటి లు, విజినోటెక్ సిబ్బంది, ఈపాస్ మిషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# నిరాశ్రయులకు కనీస అవసరాలు తీర్చగలగాలి

## అమ్మ సేవ సంకల్పం ఫౌండేషన్


**శ్రీకాకుళం. జయ జయహే**

నిరాశ్రయులకు కనీస అవసరాలు తీర్చగలగాలని, అమ్మ సేవ సంకల్పం ఫౌండేషన్ విశాఖపట్నం సభ్యుల బృందం పేర్కొన్నారు. స్థానిక పట్టణ నిరాశ్రయుల భవనంలో పేదలకు ప్రతి రోజు అవసరమయ్యే నిత్యావసర వస్తువులను, అమ్మ సేవ సంకల్పం ఫౌండేషన్ విశాఖపట్నం సభ్యులు అందించారు. శ్రీకాకుళం అమ్మ సేవ సంకల్పం ఫౌండేషన్ సభ్యులు గొండు.సురేంద్రనాథ్, విశాఖపట్నం ఉపాధ్యక్షురాలు అనురాధ సంపతిరావు బుధవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ అమ్మ సేవ సంకల్పం ఫౌండేషన్ సేవలను, మన శ్రీకాకుళం జిల్లాలో కూడా విస్తృతం చేస్తామని, అందుకు శివతేజ సహకారం తీసుకుంటామని, ఈ రోజు సామాజిక సేవకులు ఉర్లం.శివతేజ పట్నాయక్ కోరిక మేరకు ఇక్కడ నిరుపేదలకు రోజు అవసరమయ్యే వస్తువులను అందించామన్నారు. నైట్ షెల్టర్ తోపాటుగా అరసవల్లి కూడలి, కోరాడ వారి వీధి, మండల వీధిలో నిస్సహాయులకు, శివతేజ సహకారంతో అందించామన్నారు. నగరంలో సేవలకు శ్రీకారం చుడతామని, అమ్మ సేవ సంకల్పం ఫౌండేషన్ చైర్మన్ బొత్స.దిలీప్, వైస్ చైర్మన్ అనురాధ, జనరల్ సెక్రటరీ జగదీశ్ జిల్లాకు పూర్తి సహకారాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సంఘ సేవకులు ఉర్లం.శివతేజ పట్నాయక్, అమ్మ సేవ సంకల్పం ఫౌండేషన్ సభ్యులు హేమంత్, వెంకటేశ్వర రావు, నైట్ షెల్టర్ నిర్వాహకులు, నిరాశ్రయులు, స్థానికులు పాల్గొన్నారు.

# తల్లికి వందనం.. బిడ్డకు అక్షర భాగ్యం.!

## టీడీపీ గుంటూరు బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య

**గుంటూరు, జూలై 22, జయ జయహే :**



"తల్లికి వందనం" పథకం ద్వారా అమ్మకు గౌరవం, ప్రతి బిడ్డకు విద్యాభాగ్యాన్ని అందిస్తున్నది తెలుగుదేశం ప్రభుత్వమని టీడీపీ గుంటూరు బీసీ సెల్ అధికార ప్రతినిధి రాచకొండ లక్ష్మయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం "అమ్మఒడి" పథకం కింద ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుతున్నా ఒక్క విద్యార్థికే ఆర్థిక సహాయం అందించిందని, నేడు కూటమి ప్రభుత్వం "తల్లికి వందనం" పథకం ద్వారా ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు అర్హులై చదువుతున్నారో అంతమందికీ ఆర్థిక సహాయం అందిస్తూ ప్రతి విద్యార్థి విద్యకు భరోసా కల్పిస్తోందని వివరించారు. రాష్ట్రంలోని 17 వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లలకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేసి వారి కుటుంబాలకు అండగా నిలిచిందని కొనియాడారు. బీసీ విద్యార్థులు: 34,89,541 మంది, ఓసీ విద్యార్థులు: 10,16,164 మంది, ఎస్సీ విద్యార్థులు: 13,85,962 మంది, ఎస్టీ విద్యార్థులు: 5,10,995 మంది, మైనారిటీ విద్యార్థులు: 73,928 మంది చొప్పున ప్రతి తల్లికి గౌరవం. ప్రతి బిడ్డకు విద్యా భవిష్యత్తు కల్పించామని... ఇదే తెలుగుదేశం ప్రభుత్వ సంకల్పమని జిల్లా అధికార ప్రతినిధి లక్ష్మయ్య అన్నారు



# విశాఖలో పాఠశాలలు... అనకాపల్లిలో అజమాయిషీ...!

## విశాఖలో కలపాలని ఏడీసీ బలిరెడ్డి విజ్ఞప్తి

**అగనంపూడి, జూలై 22, జయ జయహే :**

విశాఖ జిల్లాలో ఉంటూ అనకాపల్లి జిల్లా అజమాయిషీలో ఉన్న పాఠశాలలను తిరిగి విశాఖ జిల్లాలో విలీనం చేయాలని ఏడీసీ ఛైర్మన్ బలిరెడ్డి సత్యన్నారాయణ కోరారు. ఈ మేరకు బుధవారం అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి జి అప్పారావు నాయుడిని మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. కొత్త జిల్లాలు ఏర్పాటు అయ్యాక విశాఖ జిల్లా గాజువాక మండలం అగనంపూడి రెవెన్యూ పరిధిలో లో ఉన్న పరవాడ మండల విద్యాశాఖ ఆధీనంలో ఉన్న లేమర్తి , పినబడక జిల్లా పరిషత్ హై స్కూల్స్‌తో మరో ఆరు ఎంపీపీ పాఠశాలలో పరవాడ నుండి గాజువాక మండలానికి విలీనం చేయాలని వినతి పత్రం అందజేశారు. డీఈఓ అప్పారావు మాట్లాడుతూ గతంలో అందజేసిన విన్నసపత్రం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కి పంపించినట్టు వెల్లడించారు. అక్కడి నుంచి ఇంకా ఎలాంటి నిర్ణయం రాలేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వములో నాడు నేడు పనుల్లో మిగిలిన నిధులు పాఠశాల అభివృద్ధికి ఖర్చు పెట్టుకోవచ్చు అని, తల్లికి వందనం పథకం కింద కుటుంబములో ఎంతమంది పిల్లలు చదువుతున్న వారందరికీ తల్లిలకు అకౌంట్లో నగదు జమ అయ్యిందని, ఈ నెల 24 వరకు దశలవారీగా డబ్బులు వస్తాయని ఎవరికైనా తల్లికి వందనం డబ్బులు రాకపోయినా ఎడల వారికి సంబంధించిన స్వర్ణ గ్రామ వార్డు లో తనిఖీ చేసుకోవాలని కోరారు.

For a pure tomorrow.. జయహే

# ఎజెండాలో నీట్‌పై చర్చ ఎందుకు లేదు !

**జయ జయహే :**

తప్పు జరిగినప్పుడు ప్రభుత్వంలో ఎవరు ఉంటే వారినే నిందిస్తారు. వారిమీదే విమర్శలు గుప్పిస్తారు. పాలన బ్రహ్మాండంగా చేస్తుంటే..పకడ్బందీగా చర్యలు తీసుకుని ఉంటే నీట్ పేపర్ ఎందుకు లీక్ అవుతుంది. ఎందుకు దుర్మార్గులు పేపర్ అమ్ముకునేందుకు సాహసిస్తారు. ఇలా చేయడం వల్ల ఎందరో విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి. కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇదంతా కూడా ప్రభుత్వ వైఫల్యంగానే చూడాలి. అన్ని రాష్ట్రాలు తమంత తాముగా ఎంసెట్ నిర్వహించుకుని, పక్కగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే, దానిని కాదని నీట్‌ను ప్రవేశ పెట్టారు. కేంద్రం ఆంధీనంలోని ఎన్‌టిఎ నీట్ నిర్వహణలో ఎందుకు తప్పుచేసింది. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిజానికి పేపర్లు లీక్ చేసిన వారిని, అమ్ముకున్న వారిని బహిరంగంగా ఉరితీయాలి. ఇకపోతే ప్రస్తుతానికి వస్తే...పేపర్ లీక్‌లో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీక్షకు దిగారు, కాక్రోచ్ పార్టీ మొదటి డిమాండ్ ఇదే తమ డిమాండ్ అని ప్రకటించింది. ఢిల్లీలో ఆందోళనకు పిలుపును ఇచ్చింది. అయినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదు. దీనిపై ప్రధాని స్పందించలేదు. నిరంతరం విదీశీ పర్యటనలతో గడుపుతున్న ప్రధాని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడడం లేదు. పార్లమెంట్ సమావేశాలకు ముందే ప్రధాని స్పందించి, సిజెపి నేతలను పిలిచి మాట్లాడడం, నీట్‌పై తీసుకుంటున్న చర్యలను వివరించడం జరిగివుంటే బాగుండేది. నిజానికి సమస్యలను పరిష్కరించడం అన్నది ప్రజల కోసమే కదా. మరి ఎందుకు పెద్దగా స్పందించలేదన్నదే సమస్య. ఇకపోతే కాక్రోచ్ పార్టీ చేస్తున్న ఆందోళనలను హైజాక్ చేసేందుకు కాంగ్రెస్ , రాహుల్ గాంధీ యత్నించారనే చెప్పాలి. విద్యార్థుల ఆందోళనలో దూరడం ద్వారా సమస్యకు రాజకీయం పులిమారు. రాహుల్‌కు సమస్యల పట్ల చిత్తశుద్ధి కనిపించడం లేదు. పార్లమెంటులో చర్చించి, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన పెద్దమనిషి రాజకీయ డ్రామాకు తెరతీసారు. ఇకపోతే అధికార పార్టీ నేతలు చేస్తున్న వాదనలో పసలేదు. నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. ప్రధాని నివాసం ఎదుట రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనపై స్పందించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఇది భారత రాజకీయ చరిత్రలో ఒక చీకటి రోజని పేర్కొంటూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాంగ్రెస్ ఉల్లంఘించిందని విమర్శించారు. విమర్శించ డానికి ఎన్నయినా చెప్పవచ్చు. నిజానికి నీట్ అంశంపై చర్చను ఎజెండాలో పెట్టివుంటే సమస్య వచ్చి ఉండేది కాదు. ఎందుకు అజెండాలో పెట్టలేదో ముందుగా కేంద్రం వివరణ ఇవ్వాలి. మొత్తంగా ఇప్పుడు తప్పెవరిదంటే..అధికార పార్టీదే అని చెప్పాలి. సమస్యపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే దేశ రాజధాని ఢిల్లీ ఆందోళనలతో అట్టుడుకుతోంది. సీజేపీ, కాంగ్రెస్ ధర్నాలతో హైటెన్షన్ నెలకొంది. విద్యార్థులపై లాఠిచార్జ్‌కు నిరసనగా.. ప్రధాని నివాసం దగ్గర 3 గంటలపాటు కాంగ్రెస్ మెరుపుధర్నా నిర్వహించింది. పార్లమెంటు వాయిదా తర్వాత పాదయాత్ర చేసిన కాంగ్రెస్ ఎంపీలు.. నేరుగా ప్రధాని నివాస దగ్గరకు వెళ్లి ధర్నా నిర్వహిచారు. నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని, హోంమంత్రి, విద్యాశాఖ మంత్రి రాజీనామాకు రాహుల్ డిమాండ్ చేశారు. కాగా.. రాహుల్, ప్రియాంక సహా.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ తర్వాత రాత్రి విడుదల చేశారు. 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులపై పోలీసుల చర్యలు, కాంగ్రెస్ ధర్నా.. తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం తొలిసారిగా స్పందించారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ వివాదానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ప్రధాన్ ఆరోపించారు. పార్లమెంటులో నీట్ అంశంపై సవివరంగా చర్చించడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వెలుపల నిరసన చేపట్టారని కేంద్ర మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమగ్ర చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం తెలియజేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రజాస్వామ్య చర్చ కన్నా రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాహుల్ గాంధీకి విద్యార్థులు అవసరం లేదు.. గొడవలు సృష్టించడమే లక్ష్యమంటూ పేర్కొన్నారు.. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. విద్యార్థులకు సమాధానాలు, సంస్కరణలు, జవాబుదారీతనం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటున్న ధర్మేంద్ర ప్రధాన్ ఇంతకాలం ఎందుకు స్పందించ లేదో చెప్పాలి. విపక్షంలో ఉన్నవారు ఎవ్వరైనా రాజకీయం చేస్తారు. బిజెపి కూడా అదే చేసేది. ప్రజాస్వామ్య నియమాలను, పార్లమెంటరీ సంప్రదాయాలను పాటిస్తే మంచిది. సమస్య ఏదైనా చర్చకు అవకావం రావాలి. ఎందుకంటే ఈ మధ్య కాలంలో పార్లమెంటులో సమర్థవంతంగా చర్చలు సాగడం లేదు. సమస్యలపై ప్రస్తావన జరగడం లేదు.ఇందుకు అధికార పక్షానిదే ప్రధాన బాధ్యత. విద్యార్థులు లేవనెత్తుతున్న సమస్యలపై ప్రభుత్వం చర్చించాలనుకుంటే ఎందుకు ఎజెండాలో పెట్టలేదో చెప్పాలి. ప్రజాస్వామ్యంలోప్రతిపక్ష పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉంటుంది. పార్లమెంటులో చర్చలకు అవకాశం రానప్పుడు ఎవ్వరైనా వీధుల్లోనే నిరసనలు తెలుపుతారు. తాము అనుకున్నట్లుగానే పార్లమెంట్ నడవాలని పాలకపక్షం కోరుకోవడం సరికాదు. ప్రజలకు ఏది అవసరమో అది గుర్తించి, చర్చించి, పరిష్కరిస్తే మంచిది. నీట్‌పై చర్చించి, లీకులు లేకుండా, అన్ని రాష్ట్రాలకు ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకుంటే మంచిది.





## మూడోరోజూ పార్లమెంట్‌లో గందరగోళం

### విపక్షాల నిరసనలతో హోరెత్తిన సభ

### నల్ల చొక్కలాతో పార్లమెంట్ ముందు విపక్షాల నిరసన

**జయ జయహే :**

వరుసగా మూడో రోజు కూడా పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యులు వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టబట్టడంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. బుధవారం కూడా లోక్‌సభ, రాజ్యసభలో గందరగోలం నెలకొన్నది. దీంతో రెండు సభలు 12 గంటల వరకు వాయిదా పడ్డాయి.తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ చేపట్టాలని లోక్‌సభలో విపక్షాలు డిమాండ్ చేశాయి. సభను ఆర్డర్‌లోకి తెచ్చేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించారు. కానీ ఫలితం కనిపించలేదు. ప్రశ్నోత్తరాల సమయం జరిగే రీతిలో విపక్షాలు సహకరించాలని ఆయన కోరారు. ఎటువంటి సమస్యపైన అయినా చర్చ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. కానీ విపక్ష సభ్యులు వినిపించుకోలేదు. నినాదాలు చేశారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలవరకు వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా విపక్షాలు సీజేపీపై లాఠీచార్జ్ అంశాన్ని చర్చించాలని పట్టుపట్టాయి. కానీ చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ వ్యతిరేకించారు. గందరగోళ నేపథ్యంలో సభను 12 వరకు వాయిదావేశారు. మరో వైపు విపక్ష ఎంపీలు ఇవాళ నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేశారు. నీట్ పేపర్ లీకేజీ అంశంలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నిరసనగా నల్ల దుస్తులు ధరించినట్లు కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా ఆరోపించారు.

## ప్రధాని ఇంటిముందు ధర్నాకు కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్

### ఖర్గే నివాసానికి వెళ్లి...గుట్టుచప్పుడు కాకుండా ధర్నా

### పోలీసులను ఆయోమయంలోకి నెట్టి కాంగ్రెస్ తీరు

**జయ జయహే :**

ఢిల్లీలోని లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని మోదీ నివాసం ముందు మంగళవారం కాంగ్రెస్ నేతలు మెరుపు ధర్నా చేపట్టిన విషయం పక్కా ప్లాన్‌తో చేపట్టినట్లు తెలుస్తోంది. నీట్ పేపర్ లీకేజీతో పాటు సీజేపీ కార్యకర్తలపై లాఠీఛార్జ్ అంశంలో ఆ ధర్నా నిర్వహించారు. అయితే కట్టుదిట్టమైన లోక్ కళ్యాణ్ మార్గ్ కు కాంగ్రెస్ నేతలు అంతా ఎలా వెళ్లారని ఢిల్లీ పోలీసులు ఇప్పుడు ఆరా తీసే పనిలో పడ్డారు. వాస్తవానికి మంగళవారం కాంగ్రెస్ నేత మల్లిఖార్జున్ ఖర్గే బర్త్‌డే సెలబ్రేట్ చేసుకున్నారు. ఆ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు ఖర్గే ఇంటికి కాంగ్రెస్ నేతలు వెళ్లారు. సెంట్రల్ ఢిల్లీలోని రాజాజి మార్గ్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే నివాసం ఉన్నది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో పాటు అనేక మంది ఎంపీలు తొలుత మల్లిఖార్జున్ ఖర్గే ఇంటికి వెళ్లారు. ఖర్గేకు 84వ పుట్టిన రోజు విషెస్ తెలిపారు. కానీ కాంగ్రెస్ నేతలు అకస్మాత్తుగా మరో ప్లాన్ వేశారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు ప్రధాని ఇంటి వైపు ర్యాలీ తీశారు. ఖర్గే ఇంటికి కొన్ని మీటర్ల దూరంలోనే ప్రధాని మోదీ నివాసం ఉన్నది. అతి తక్కువ సమయంలోనే కాంగ్రెస్ ఎంపీలు .. ప్రధాని మోదీ గేటు ముందు చేరుకున్నారు. అక్కడే మెరుపు దాడికి దిగారు. సుమారు మూడు గంటల పాటు బైఠాయించారు. ఢిల్లీ పోలీసులు ఈ ఘటనతో షాక్ అయ్యారు. సెక్యూర్టీ ఉల్లంఘన జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కట్టుదిట్టమైన ప్రాంతంలోకి ఒకేసారి ఇంత మంది ఎలా వచ్చారని పోలీసులు ఆలోచిస్తున్నారు. అయితే ఖర్గే పుట్టినరోజు కావడం వల్ల ఆ ప్రాంతంలో భారీ సంఖ్యలో ఉదయం నుంచే జనం ఉన్నారని, రాజాజి మార్గ్‌లో అనేక వాహనాలను కూడా పార్క్ చేసినట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. 7 లోక్ కళ్యాణ్ మార్గ్ లొకేషన్‌లో కాంగ్రెస్ ఎంపీలు ధర్నాకు దిగడం పట్ల ఢిల్లీ పోలీసులు కన్ఫ్యూజన్‌లో ఉన్నట్లు తెలిసింది.అయితే ఈ ఘటనకు ఎవరు బాధ్యత తీసుకుంటారో తెలియదు. కానీ ఢిల్లీ పోలీసులు మాత్రం సెక్యూర్టీ ఉల్లంఘన జరిగినట్లు అంగీకరిస్తున్నారు. ఖర్గే ఇంటికి చేరిన కాంగ్రెస్ నేతలు.. పార్లమెంట్ సమీపంలో ఉన్న విజయ్ చౌక్‌కు ర్యాలీ తీస్తారని భావించినట్లు కొందరు పోలీసులు చెప్పారు.

## లాఠీఛార్జ్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్

### అత్యవసర చర్చకు సుప్రీం తిరస్కరణ

**జయ జయహే :**

కాక్రోచ్ జనతాపార్టీ 'చలో సంసద్' మార్చ్‌లో భాగమైన నిరసనకారులపై పోలీసు లాఠీఛార్జ్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే.. దాని అత్యవసర విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని.. అలాగే పిటిషనర్ కూడా తన సమయాన్ని వృథా చేసుకోవద్దని ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోల గురించి పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా..'మాకు వీడియోలు చూసే సమయం లేదు' అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ పిటిషన్ అత్యవసర విచారణకు దిల్లీ హైకోర్టు కూడా నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ అంశంలోకి తమను లాగొద్దని వ్యాఖ్యానించింది. దాంతో ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ లాఠీఛార్జిపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని పిటిషనర్ కోరారు. నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన చలో పార్లమెంటు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేల మంది సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకుని బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడంతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. పలుచోట్ల రాళ్లు రువ్వడం, ఘర్షణ పడటం, తోపులాటలతో అటు పోలీసులు, ఇటు ఆందోళనకారులు గాయపడ్డారు. చాలా మంది రక్తమోడుతున్న వీడియోలు వైరలయ్యాయి. వీటిని చూపుతూ విచారణ కోరారు. అయితే సుప్రీం ప్రధాన న్యాయమూర్తి వాటిని తిరస్కరించారు. అత్యవసరంగా చర్చించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు.

# బిజెపి.. కాంగ్రెస్ పోటాపోటీ ఆందోళనలు

### లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం.. గాంధీభవన్ ముట్టడికి బిజెపి నేతల దూకుడు

### ఇరువర్గాల పరస్పరం దాడులతో ఉద్రిక్తత.. రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు

### నగరంలో పలువురు కాంగ్రెస్, బిజెపి నేతల అరెస్ట్

**జయ జయహే**

కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలతో బుధవారం హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లోక్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వగా, మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ఖండిస్తూ బీజేపీ నాయకులు గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ఇరువర్గాలు ముట్టడికి బలయుదేరడంతో పాటు పరస్పర దాడులకు తెగించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న నిరసనలతో నాంపల్లి బీజేపీ కార్యాలయం దగ్గర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు యత్నించారు. కాంగ్రెస్ నేతలు రాకుండా బీజేపీ నేతలు కర్రలతో అడ్డుకున్నారు. మరోపక్క.. రాజ్ భవన్ ముట్టడికి యత్నించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు నాంపల్లి పీఎస్‌కు తరలించారు. కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి నాంపల్లి పీఎస్‌కు చేరుకున్నారు. ఖైరతాబాద్‌లో కూడా కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. నెక్లెస్ రోడ్డులోని ఐమాక్స్ సమీపంలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం దగ్గరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్ భవన్ ముట్టడికి యత్నించిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఘటనా స్థలంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ నాయకులను అక్కడే అడ్డుకున్నారు. అలాగే లోక్‌భవన్ వైపు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఖైరతాబాద్ సర్కిల్ వద్ద నిలువరించారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కర్రలతో దాడులు జరిగాయని, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసు వాహనాలపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ముందస్తు చర్యల్లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తొలుత కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మంత్రులు, కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లగా... వారిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా అడ్డుకున్నారు. చేతుల్లో కర్రలతో బండి సంజయ్ ఇంటికి బీజేపీ నేతలు కాపలాగా నిలవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడులకు తెగబడ్డారు. ఇరుపార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కరీంనగర్ వీధులు రణ-రంగాన్ని తలపించాయి. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉద్రిక్తతలను అదుపు చేసేందుకు లాఠీలకు పనిచెప్పారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను చెదరగొట్టి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా... కాంగ్రెస్ దాడికి నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు యత్నించాయి. అయితే వారిని కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడంతో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రెండు ప్రధాన పార్టీల సవాల్-ప్రతిసవాల్‌తో కరీంనగర్‌లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.





Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com